Email:prajamantalu@gmail.com

www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 66

గురువారం

ఆగస్టు,17,2023

పేజీలు - 8 వెల - రూ 5 : 00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## అంబారిపేటలో ట్రాక్టర్ కింద పడి రైతు మృతి



వెల్గటూర్ ఆగస్ట్ 16 (ప్రజా మంటలు): మం. అంబారీపేట లో తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్న రైతు ముది మడుగుల పోచయ్య(50), ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కిందపడి మరణించాడు. ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్త గా నడపడం వల్లనే, అదుపు తప్పి ట్రాక్టర్ రైతు పై ఎక్కడంతో, రైతు ట్రాక్టర్ కేజీవిల్స్ కింద పడిఅక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయడు. పొలంలో బురదగా ఉండడంతో తప్పించుకోలేని రైతు,కేజీవీల్స్ కింద చిక్కుకోగా, శరీరం నుజ్జునుజ్జుయి ,తల మొండెం వేరువేరు అయిపోయిందని తెలుస్తుంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ధర్మపురి సి ఐ రమణమూర్తి, వెల్గటూర్ ఎస్సై శ్వేత ఘటన స్థలానికి చేరుకొని, మృత దేహానికి వైద్యులచే ఘటన స్థలంలో పోస్టు మార్టం నిర్వహించారు.



ఆటోను ఢీకొన్న లారీ..ఐదుగురు కూలీల మృతి

లారీ డ్రైవర్ తాగి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు

వరంగల్ జిల్లాలో ఘోర

# రోడ్డు ప్రమాదం

వరంగల్, : వరంగల్ జిల్లాలో ఘోరమైన రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆటోను ఎదురు నుంచి లారీ ఢీకొట్టింది. వరంగల్ నుంచి తొర్రూరు వైపు ఆటో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఆటోలో ఉన్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలు అయ్యారు. లారీ డ్రైవర్ తాగేసి డ్రైవింగ్ చేసినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద దగ్గర ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మరో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఫూటుగా మద్యం సేవించి, రాంగ్ రూట్ లో వచ్చాడని అందుకే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ప్రమాదం ధాటికి ఆటో నుజ్జునుజ్జు అయిపోయింది. మృతదేహాలన్నీ ఆటోలోనే చిక్కుకుపోగా, స్థానికులు బయటకు తీసే ప్రయత్నం చేశారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీకి

# సిద్ధం



పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు

హైదరాబాద్: జిహెచ్ఎంసి నగర పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ ఇండ్ల పంపిణీ ప్రక్రియపైన పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు ఈరోజు ప్రగతి భవన్‌లో ఒక ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. హెచ్ఎంసీ పరిరు. వరికి డబుల్ బెడ్ రూమ్ పంపిణీపై న్యాయంగా వ్యవ హరించాలని అధికారులను సూ చించా రు. అన్యాయం జరగకుండా ప్రతి పేద వాడికి డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ న్యాయపరంగా జరగాల ని అన్నారు. ఇళ్ల నిర్మాణం కూడా త్అందుకు భిన్నంగా బీఆర్ ఎస్ ప్ర భుత్వం పేదల ఆత్మగౌరవాన్ని కాపా డేందుకు రెండు పడక గదులతో కూడిన ఇళ్లను నిర్మించి ఉచితంగా అందజేస్తోంది. దీన్ని ప్రభుత్వం నిర్విరామ ప్రక్రియగా కొనసాగిస్తోందన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రారం భోత్సవానికి సిద్ధంగా ఉన్న లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదలకు నేటి నుంచి ప్ర భుత్వం అందజేస్తోంది. సొంత భూమి ఉండి ఇల్లు కట్టుకోలేని పేదల కోసం ప్రభుత్వం గృహలక్ష్మి అనే పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద మూడు దశల్లో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదా రులకు మూడు లక్షల రూపా యల ఆర్థిక సహాయం అందజేస్తారు. ముందుగా ఒక్కో నియోజకవర్గంలో 3 వేల మందికి లబ్ధి చేకూరుతుంది. ప్రభు త్వం మానవ తా దృక్పథంతో ఆలో చించి వికలాం గులకు గృహలక్ష్మి పథకంలో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించిందని కేసీఆర్ అన్నారు. స్వాతంత్ర దినోత్సవ ప్రసంగం లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన నేపథ్యంలో పంపిణీ ప్రక్రియను జిహెచ్ఎంసి మరింత వేగవంతం చేసింది. జిహెచ్ఎంసి పరిధిలోని నగర మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహ మూద్ అలీ, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ లు హాజరైన ఈ సమావేశానికి జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇప్పటికే 70వేల ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, అర్హులైన లబ్ధిదారులకు అందించే కార్యక్రమం వేగంగా నడుస్తుందని అధికారులు ఈ సమీక్ష సమావేశంలో మంత్రులకు తెలియజేశారు.

## ఎన్నికల నగారా మ్రోగించిన ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బూతు స్థాయి కార్యకర్తల మీటింగ్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత ఎన్నికల నగారా మ్రోగించారు. బోధన్ పట్టణంలో ఐదు కిలోమీటర్ల వరకు పాదయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తల స్థాయి మీటింగ్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే షకీల్ మాట్లాడుతూ బోధన్ పట్టణంలో, నియోజక వర్గంలో ఇప్పటివరకు కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు.




సీఎం టేబుల్‌పై ఎమ్మెల్యేల

# టోటల్ పిక్చర్..

ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపిస్తూ

ఎమ్మెల్యేలకు

# క్లాసులు..!

హైదరాబాద్, : ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. ప్రతిపక్షాలు ఊపుమీదున్నాయి. రోజుకో అప్‌డేట్‌తో కాక రేపుతున్నాయి. మరి అధికార పార్టీలోని బిగ్‌బాస్ కు ఎలా ఉంటుంది. రాబోయే ఎన్నికల్లో గెలవడం ఎంత ముఖ్యమో.. ప్రతిపక్షాలకు అంతకుమించి చుక్కలు చూపించడం కూడా అంతే ముఖ్యం..ఈ ముక్క కేసీఆర్‌కు తెలియంది కాదు.. ఎందుకంటే ఆయన మార్క్ పాలిటిక్స్ ఎలా ఉంటాయో.. ఊహించలేం.. కాకపోతే ఎంత పెద్ద లీడరైనా..సైన్యం స్ట్రాంగ్‌గా లేకపోతే.. యుద్ధం చేయడం కష్టం.. ఇది కూడా పెద్దాయనకు బాగా తెలుసు.. అందుకే.. ఎలెక్షన్ రేటింగ్ రేసును బట్టి ఎమ్మెల్యేలను పిలిచి..ప్రోగ్రెస్ రిపోర్టు ముందు పెట్టి మరీ క్లాసు పీకుతున్నారట పెద్దసార్.. గతం గతః.. ఇప్పుడు మాత్రం ఒళ్లు దగ్గర పెట్టుకోవాల్సిందేనని..

## జిల్లా వ్యాప్తంగా వివిధ ఏజెన్సీల, ట్రావెల్స్‌పై ఏకకాలంలో పోలీసుల తనిఖీలు

- విదేశాల్లో ఉద్యోగాల కోసం వెల్లేవారు నకిలి ఏజెన్సీల ఆశ్రయించి మోసపోవద్దు
- ప్రభుత్వ అనుమతి ఉన్న ఏజెన్సీల ద్వారానే సంప్రదించండి - జిల్లా ఎస్పీశ్రీ ఎగ్గడి భాస్కర్



జగీత్యాల ఆగస్ట్ 16 (ప్రజా మంటలు) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా 15 ట్రావెల్స్, 36 ఏజెన్సీల పై ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ట్రావెల్స్ ఏజెన్సీలో ఉన్న 101 పాస్ పోర్ట్ లను సీజ్ చేయడం జరిగిందని, 300 డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని పోలీసులు తెలిపారు. విదేశాలలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసే ఏజెన్సీలు, ట్రావెల్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధితట్రావెల్స్, ఏజెన్సీ లను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై పీడి యాక్ట్ నమోదు చేస్తామని జిల్లా ఎస్పీశ్రీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం వెల్లేవారు నకిలి ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని. నకిలి ఏజెంట్లు ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ గుర్తింపు వున్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలని సూచించారు. నిరుద్యోగ యువతి యువకులు విదేశాల్లో ఉద్యోగ అవకాశం కోసం ప్రయత్నించే ముందు సంబందిత ఏజెంట్లకు అనుమతి ఉందా లేదా అని తెలుసుకోవాలని జిల్లా ఎస్పి సూచించారు.





మరో కీలక ఘట్టంలో

# చంద్రయాన్

చంద్రుడి ఆర్బిట్‌లోకి ప్రవేశించిన మాడ్యూల్

బెంగళూరు, : ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రాజెక్టు మరో కీలక ఘట్టాన్ని పూర్తి చేసుకుంది. బుధవారం మరోసారి ఫైరిగ్ ను విజయవంతంగా చేయడం ద్వారా.. చంద్రయాన్-3 ను 153 బై 163 కిలోమీటర్ల ఆర్బిట్ లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. అంటే దీని ద్వారా చంద్రుడి చుట్టూ ప్రదక్షిణలు, అదే తిరగడం ఇక అయిపోయిందన్నమాట. సులభంగా చెప్పాలంటే చంద్రయాన్-3 అనే యాత్ర పూర్తి చేసుకున్న ఘట్టంగా చెప్పకోవచ్చు. ఆగస్ట్ 17వ తేదీన ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ వేరు పడుతుందన్నమాట. ఇలా సెపరేట్ అయిన ల్యాండర్ మాడ్యూల్ ఆగస్ట్ 23వ తేదీన మెల్లగా ల్యాండ్ అయితే చంద్రయాన్-3 మిషన్ విజయవంతం అయినట్టుగా భావిస్తారు. చంద్రయాన్-3 153 బై 163 కిలోమీటర్ల ఆర్బిట్ లోకి ప్రవేశపెట్టారు. ఇక్కడి నుంచి 100 కిలోమీటర్ల దూరం చేరేదాకా ప్రయాణించి అక్కడి నుంచి ల్యాండర్ జంప్ చేస్తుందన్నమాట. ఇస్రో శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఆగస్ట్ 23వ తేదీన అది ల్యాండ్ అవుతుంది. అంటే సరిగ్గా ఇంకో వారమే ఉందన్నమాట.. ప్రయోగం విజయవంతమో కాదో తేలడానికి ఇదే కీలకం.

## ప్రజానాడి




# వయోవృద్ధులను అన్నివిదాల ఆడుకొంటాం

## ధర్మపురిలో రెడ్ క్రాస్ ఉచిత వైద్య శిబిరం - సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్



ఆగస్ట్ 16 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా మొబైల్ వాహనం ద్వారా దివ్యాంగులకు, వృద్ధులకు, ట్రాన్స్ జెండర్లకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తున్నారని. మంత్రి తెలిపారు. మారుమూల ప్రాంతంలోని వయోవృద్ధులకు వైద్య పరీక్షలు అందించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని,వీరిని అన్నివిధాలా ప్రభుత్వం అదుకొంటుందని వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు తెలంగాణ ప్రభుత్వంఅధ్వర్యంలో వృద్ధులకు, దివ్యాంగులకు జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా,శిశు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రతిరోజు వివిధ గ్రామాలలో మొబైల్ వాహనం తిరుగుతూ పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తుందని చెప్పారు. అందరూ ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోలేని వారికి ఇది మంచి అవకాశం అని మంత్రి చెప్పారు. వైద్య పరీక్షలు చేస్తున్న తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా వృద్ధులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి డా. భోనగిరి నరేష్,రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి మంచాల కృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీజిల్లా కార్యవర్గ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్,ధర్మపురి మున్సిపల్ చైర్మన్ సంగి సత్తెమ్మ, డీ.సీ.ఎం.ఎస్ చైర్మన్ ఎలా శ్రీకాంత్ రెడ్డి,యంపిపిచిట్టిబాబు, జడ్పీటిసి బత్తిని అరుణ,మార్కెట్ కమిటీ చైర్మెన్ అయ్యోరి రాజేష్,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## డబల్ బెడ్ రూమ్ ఇళ్లు గాలికి వదిలేసి గృహలక్ష్మి పథకం పేరుతో మళ్ళీ మోసం



జమ్మికుంట (ప్రజామంటలు)

హుజరాబాద్ నియోజకవర్గం పరిధిలో గతంలో ఇచ్చిన మాట డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు గాలికి వదిలేసి గృహలక్ష్మి పథకం పేరుతో అమాయక ప్రజలను మోసం చేసే విధంగా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం. హుజురాబాద్ నియోజకవర్గం గత ఉప ఎన్నికల్లో గెలిచినప్పటి నుండి స్థానిక ఎమ్మెల్యే కేంద్రంలో అధికారంలోకి ఉన్న నియోజకవర్గనికి ఎన్ని ఇల్లులు , కేంద్రం నిధులు ఎన్ని ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తూ, ఫోటో ఫోజులకు, కాగితాలకే పరిమితమైన మీ అభివృద్ధి వాస్తవంగా ఎందుకు చేయట్లేదు, ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేస్తూ ఇల్లు లేని నిరుపేద ప్రజలు అల్లాడుతున్న వారితో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆక్రమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ హుజరాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి లు పోడెటి బిక్షపతి, చిట్యాల శంకర్, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సూర్య, హరీష్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుల కోసం (విగ్గు తయారీకై) జుట్టు వితరణ



హైద్రాబాద ఆగస్టు 16 (ప్రజామంటలు)

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కొమరవోలు కాంతారావు, చిద్విలాస్ (హెయిర్ డొనేషన్) తమ జుట్టును క్యాన్సర్ బాధితులకు కోసం ఒక సామాజిక బాధ్యతగా స్పందించి జుట్టును ఉచితముగా విరాళంగా అందజేశారు. క్యాన్సర్ పేషెంట్ కొరకు ఒక విగ్గు తయారీ అయ్యే ఖర్చు 5 వేల రూపాయలు హైదరాబాద్ హెయిర్ డొనేషన్ ఫర్ క్యాన్సర్ పేషెంట్ ఆర్గనైజేషన్ వారికి విరాళంగా అందజేశారు. ఎవరైనా క్యాన్సర్ పేషెంట్ కోసం తమ జుట్టును విరాళంగా అందించాలి అనుకున్నవారు హైదరాబాద్ హెయిర్ డొనేషన్ ఫర్ క్యాన్సర్ పేషెంట్ ఆర్గనైజేషన్ శివ సెల్ నంబర్లు 9666406586, 9908204142 లకు సంప్రదించగలరని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్, మేనేజింగ్ ట్రస్ట్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## ఏసీపీ ప్రశాంత్ రెడ్డి ని కలసిన మడిపల్లి మాజీ ఉపసర్పంచ్



జమ్మికుంట ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

మడిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ కాయిత లింగారెడ్డి బుధవారం ఏసీపీ పింగలి ప్రశాంత్ రెడ్డి ని హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి రాబోయే ఎన్నికల్లో మీరు తప్పకుండ హుజురాబాద్ నియోజకవర్గం నుండి బి ఆర్ ఎస్ తరుపున పోటీ చేయాలనీ వేడుకున్నాడు. ఎందుకంటే మీరు గతంలో మాకు జమ్మికుంట సీఐ గా మీరు చేసిన సేవలు మరువలేనివని, మీకు బీద ప్రజల్లో మంచి పేరు ఉందని తెలిపాడు. ఈ సందర్బంగా ప్రశాంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి అధిష్టానం ఆదేశిస్తే ప్రజా సేవ చేయడానికి నేను సిద్ధం అని తెలిపాడు. ఈ కార్యక్రమంలో అశోక్ రెడ్డి, భరత్ చంద్ర రెడ్డి పాల్గొన్నారు.

## వార్డులలో అభివృద్ధి పనులు పరిశీలిస్తూ.పెండింగ్ నులవివరాలుతెలుసుకుంటున్నఎమ్మెల్యే



జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

పట్టణంలో 1, 2, 3, 4, 5, 6, 7, 8, 17, 18, వార్డులలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను పరిశీలిస్తూ, పెండింగ్ లో ఉన్న వివిధ పనుల వివరాలను తెలుసుకుంటూ, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశిస్తూ, వార్డులలో పర్యటించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. వెంట మున్సిపల్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్, డిఈ రాజేశ్వర్, కౌన్సిలర్ లు కూసరి అనిల్, లత జగన్, పద్మ సింగారావు, చుక్క నవీన్, క్యాధాసు నవీన్, గుగ్గిళ్ళ హరీష్, కొలగాని ప్రేమలత సత్యం, వల్లెపు రేణుక మొగిలి, మల్లవ్వ తిరుమలయ్య, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, ఏఈ అనిల్, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాలుగా వెట్టిచాకిరితో మగ్గుతున్న విఆర్ఏ లు.. విముక్తి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం

### - ప్రభుత్వ ఉద్యోగంతో విఆర్ఏ ల బాధ్యత పెరిగింది : జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత



జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

జిల్లా పంచాయితీరాజ్ శాఖకు కేటాయించిన 47 మంది వీఆర్ఏలకు ప్రభుత్వ ఉద్యోగ నియమాక ఉత్తర్వులను జిల్లా పరిషత్ క్యాంప్ కార్యాలయంలో అందజేసిన జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ....తెలంగాణ రాకముందు వీఆర్ఏలను చులకనగా చూసిన పరిస్థితి ఉండేది. వారి ఆత్మ గౌరవం కాపాడేలా అని పిలిచే స్థితికి సీఎం కేసీఆర్ తీసుకువచ్చారు. అందరికీ సమానత్వం రావాలని సీఎం కేసీఆర్ గొప్ప నిర్ణయం తీసుకున్నారు. చీదరింపులు ఉండకుండా ఆత్మ గౌరవాన్ని కల్పించారు. వీఆర్ఏల విద్యార్హతను బట్టి పోస్టింగ్ ఇస్తున్నాం. జీవో నెంబర్ 81 ద్వారా ఒక్క సంతకంతో విఆర్ఏ లందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ఘనత సీఎం కేసీఆర్ దే. బడుగు బలహీన వర్గాల పక్షాన సీఎం కేసీఆర్ కి కృతజ్ఞతలు పటేల్, పట్వారీల చేతుల్లో మగ్గిపోయిన గ్రామ సహాయకుల (వీఆర్ ఏ) కు విముక్తి కల్పించింది. వారికి ఉద్యోగ భద్రత (రెగ్యులర్) కల్పించడంతో పాటు పేస్కేల్ వర్తింపజేస్తుందని అన్నారు. మీ అందరికీ ప్రజాసేవ చేసుకొనే భాగ్యం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్ ది అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆరాట పడుతున్న సిఎం కెసిఆర్ కు బడుగు బలహీన వర్గాల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామానుజన్ చార్యులు, జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్ స్కూల్ సందర్శన రోటరీ క్లబ్ ఆఫ్ నార్త్ ముంబై వారిచే పైడిమడుగు పాఠశాలకు వాటర్ కూలర్ బహుకరణ



కోరుట్ల రూరల్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

77వ స్వాతంత్ర్య దినోత్సవం ను పురస్కరించుకొని జిల్లా పరిషత్ హై స్కూల్ పైడిమడుగు పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి ఆడెపు శివరాములు రోటరీ క్లబ్ ఆఫ్ బొంబాయి నార్త్ ,ముంబై .డిస్టిక్ 3141 వారి సహకారంతో జిల్లా పరిషత్ పాఠశాలకు 40 వేల రూపాయల విలువ గల బ్లూ స్టార్ వాటర్ కూలర్ అందించారు. తాను చదివిన పాఠశాలకు తమ వంతు కర్తవ్యంగా, బాధ్యతగా, పాఠశాల అభివృద్ధికై నిరంతరము కృషి చేస్తున్న ఆడెపు శివరాములు, గతంలో పాఠశాలకు కంప్యూటర్, కుట్టుమిషన్, గ్రైండర్, 43” ఇంచుల టీవీ నీ అందించడం జరిగింది. ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు చల్లటి నీరు అందించాలనే సంకల్పంతో రోటరీ క్లబ్ ఆఫ్ బొంబాయి నార్త్ వారి సహకారంతో బ్లూ స్టార్ 40,000 రూపాయల విలువగల వాటర్ కూలర్ పాఠశాలకు అందించినందుకు వారికి, రోటరీ క్లబ్ ఆఫ్ బొంబాయి నార్త్ ముంబై బోర్డ్ సభ్యులందరికీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకటరాజం, పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపార. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి వెంకటరాజం మాట్లాడుతూ.... విద్యార్థుల అభివృద్ధికై , గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, తమ వంతు సహకారాన్ని అందించి విద్యార్థులను ఉన్నత శిఖరాలు చేరే విధంగా సహకరించాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దమ్మ భీమారెడ్డి, పాఠశాల చైర్మన్ ఆడెపు గణేష్, ఎంపీటీసీ గడికొప్పుల మాధురి గోపాల్, కో–ఆపరేటివ్ చైర్మన్ జగన్ మోహన్ రావు , ఆశిరెడ్డి రాజేశం, శ్రీనివాసులు, పంచాయతీ సెక్రెటరీ పడాల శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఖజానా దివాలా, మోసకారి ప్రభుత్వం



గొల్లపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

గత పది సంవత్సరాలుగా సంక్షేమ పథకాల పేరిట బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో బడుగు బలహీన వర్గాలను మోసం చేస్తోందని బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం విమర్శించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పల్లెబాట బస్తి బాటల కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొక్కు గంగాధర్ గొల్లపల్లి మండలంలో పర్యటించారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో దళిత బంధును అక్కడ అందరికీ పంచిన ఈ రాష్ట్ర ప్రభుత్వం దళిత రిజర్వుడ్ స్థానమైన ధర్మపురిలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఈశ్వర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఎందుకు ఒకేసారి ఇప్పించలేక పోతున్నారని ధ్వజమెత్తారు. గొల్లపల్లి మండలంలోని లొత్తునూరు గ్రామంలో పిల్లర్ల కే పరిమితమైన రెండు పడకగదుల నిర్మాణాలను స్థానిక నాయకులతోకలసి పరిశీలించిన ఆయన ప్రభుత్వ భూమిలో రెండు పడక గదుల ఇల్లు నిర్మించే ఇస్తే ఒక్కో దానికి 20 లక్షల వరకు అవుతుండగా గృహలక్ష్మి పేరిట 3 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నంలో ఈ బిఆర్ఎస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఆరు లక్షల కోట్ల అప్పు చేసి రాష్ట్ర ఖజానాను దివాలా తీయించిన ఈ బిఆర్ఎస్ ప్రభుత్వం మరోసారి బీసీ బందు పథకం ద్వారా ఓబీసీలను మోసం చేయడానికి కుట్ర పన్నిందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ బీజేవైఎం అధ్యక్షుడు లక్కాకుల వెంకటేష్, ఉపాధ్యక్షుడు గొలి రమేష్, దళిత మోర్చా జిల్లా అధికార ప్రతినిధి బరిగెల భూమయ్య, బీజేవైఎం జిల్లా, తౌటు రెడ్డి, సిలువేరి సత్యం, భైరం నారాయణ ,కొక్కు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధిపత్య దురహంకారులను కఠినంగా శిక్షించాలి

### - సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా



పాలకుర్తి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

చెన్నూరు గ్రామంలో 12 ఏళ్ల బాలికపై దొంగతనం నెపం వేసి ఆటవిక పద్ధతుల్లో చిత్రహింసలకు గురి చేసిన ఆధిపత్య దురాహంకారులను కఠినంగా శిక్షించాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్, బహుజన కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజుల సాంబయ్య, బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేంద్ర పవర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో రాజీవ్ చౌరస్తా వద్ద రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడుతూ....ఘటన జరిగి 20 రోజులు గడిచినప్పటికీ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏంటని ప్రశ్నించారు. ఆధిపత్య సామాజిక వర్గానికి చెందిన పుస్కూరి మధుకర్ రావు ఇంట్లో దొంగతనం జరిగిందని స్టేషన్లో ఫిర్యాదు చేసిన మరో రోజు అనుమానితుల ఇంటి పైకి వెళ్లి అత్యంత పాశవికంగా ప్రవర్తించారని తెలిపారు. చేనేత కుటుంబానికి చెందిన రేగొండ సంగీత అనే 12 ఏళ్ల బాలిక, ఆమె తల్లిదండ్రులు సుజాత గణేష్ లను చిత్రహింసలకు గురి చేసారని తెలిపారు. వారు నివాసం ఉంటున్న ఇంట్లో నుంచి ఈడ్చికెళ్లి గ్రామంలోని బొడ్రాయి వద్ద వేప చెట్టుకు కట్టేసి బాలికను బెల్టుతో కొట్టారని, కంట్లో కారంపొడి మామిడి పచ్చడి రుద్ది అమానవీయ పద్ధతిలో హింసించడం దారుణం అన్నారు. బాలికతల్లి సుజాతను జుట్టు పట్టి కొట్టడమే గాక చెప్పుతో కొట్టి అవమానపరిచారని, గణేష్ ను సైతం కొట్టడంతో అవమానం తట్టుకోలేక పారిపోయాడని తెలిపారు. గ్రామపంచాయతీ భవనంలో ఆ కుటుంబాన్ని నిర్బంధించి చిత్రహింసలు పెట్టి బెదిరింపులు చేసి నేరాన్ని ఒప్పుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చారని వివరించారు. డబ్బులు చోరీలో అనుమానం ఉన్న వారి బంధువుల అమ్మాయిని వదిలేసారని, ఎలాంటి ఆ దెరువు లేని చేనేత కుటుంబాన్ని టార్గెట్ చేసి శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసినప్పటికీ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చినప్పటికీ అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ ఘటనపై స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈ ఘటనలో నిందితులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికారులు ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా న్యాయం వైపు నిలబడాలని సూచించారు. ఉద్యమాల చరిత్ర ఉన్న పాలకుర్తిలో ఆటవిక చర్యలు జరగడం, దొరల దాష్టీకాలు పెరిగిపోవడం ఈ ప్రాంతానికి అవమానకరమని తెలిపారు. నిజ నిర్ధారణ కమిటీ పేరుతో ప్రజా సంఘాల నాయకులు చెన్నూరు, మంచుప్పుల గ్రామాలను సందర్శించడం వల్ల ఈ ఘటన వెలుగులోకి వచ్చిందని, దీంతో అనివార్యంగా అధికారులు స్పందించారని వారు గుర్తు చేశారు. మధుకర్ రావు కుటుంబంపై పరువు నష్టం కేసు వేసి బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు, సిపిఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమ సత్యం, లిబరేషన్ జిల్లా కార్యదర్శి మాన్యపు బుజేందర్, విసికె జిల్లా కార్యదర్శి బొట్టు శ్రీధర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల సోమన్న, బీఎస్పీ మండల అధ్యక్షులు చెరుపల్లి కుమార్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఎల్లబెల్లి యాకయ్య, ఎరుకల పోరాట సమితి జిల్లా నాయకులు మానుపాటి అశోక్, ప్రజా సంఘాల నాయకులు గిరగాని సుధాకర్, రివల్యూషనరీ యూత్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దుస్స శివప్రసాద్, తూర్పాటి సారయ్య ఇతర ప్రజా సంఘాలు, సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యారంగ సమగ్ర అభివృద్ధికై “సైకిల్ యాత్ర”



జనగామ ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంక్షేమ హాస్టల్ సంరక్షణ ప్రభుత్వ విద్య పరిరక్షణకై అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుండి 21 తేదీ వరకు సమర భేరి సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థి నాయకులు సైకిల్ తో నినాదాలు ఓరెత్తించారు. అనంతరం ఆర్ ఎల్ మూర్తి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య, సంక్షేమమే తమ ధ్యేయంగా ప్రకటించింది. కానీ అధికారం చేపట్టి నేటికి 9 సంవత్సరాలు పూర్తి అవుతున్న ఈ జిల్లాకు మంత్రి గా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావు సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేసిన పరిస్థితి లేదని అన్నారు. ఈ యాత్ర జిల్లాలోని అన్ని మండలాలు బచన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల, చిల్పుర్, రఘునాథ్ పల్లి, స్టేషన్ ఘనపూర్, జఫర్గడ్, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, లింగాల ఘనపూర్ ల నుండి జనగామలో ముగింపు ఉంటుందని 21 నా విద్యార్థులతో భారీ భాహిరంగ సభ ఉంటుందని అన్నారు. ఈ యాత్రలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దడిగే సందీప్, ధర్మబిక్షం, జిల్లా నాయకులు లవకుమార్, యాకన్న, రంజిత్ మోహన్, సందీప్ పాల్గొన్నారు.

## ఏఐటియూసి ఆధ్వర్యంలో జిల్లా ఏఎన్ఎం ల ధర్నా




జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఏఐటీయూసి ఆధ్వర్యంలో ఏఎన్ఎం ల ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ జిల్లా ఏఎన్ఎంలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కరోనా విపత్తు లాంటి కష్ట సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన తమను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఎటువంటి పరీక్షలు లేకుండా యం.పి.ఎచ్.ఎ.ఎఫ్. లను వేంటనే రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసి నాయకులు డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా డిమాండ్ల పరిష్కారం కోసం నిరసనలు చేపట్టిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా దిగివచ్చి తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయడంతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

## ఉర్దూ మీడియం స్కూల్లో షీ టీం, ఏహెచ్ టియూ టీమ్ అవగాహన కార్యక్రమం

జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)




జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం ఉర్దూ మీడియం స్కూల్లో షీ టీం, ఏ హెచ్టీయూ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా... జిల్లాలో మహిళలు హక్కులు, రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. అదే విధంగా షీ టీం పని విధానంపై అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినిలు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం నెంబర్ కి 8712670783 సంప్రదించాలని అన్నారు. సామాజిక మధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్, ఇన్ స్టాగ్రామ్ ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో వ్యక్తి గత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. యొక్క కార్యక్రమంలో షీ టీమ్ ఎస్.ఐ. వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ వాలీబెగ్, మహిళా కానిస్టేబుల్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు 2000 పెన్షన్ ఇస్తున్న తెలంగాణ రాష్ట్రం : ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)

బీడీ కార్మికులకు 2000 రూపాయలు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం మోతే రోడ్డులో 8 జిల్లాల మరియు జగిత్యాల నియోజకవర్గ బీడీ టేకేదార్ ల సమావేశంలో పాల్గొని ప్రసంగించిన ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం అధ్యక్షులు రూప్ సింగ్ మాట్లాడుతూ.... దేశంలో 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉంటే రూ. 2 వేల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ.‘బీడీ కార్మికుల వ్యతిరేకి బిజెపి పార్టీ’ బీడీ కట్ట పై పుర్రె గుర్తు పెట్టి కార్మికుల పొట్ట కొట్టే విధంగా బిజెపి ప్రయత్నం చేస్తుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా బిఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కేసిఆర్ చేస్తున్నారు. అని పుట్టుక నుండి చనిపోయే వరకు ప్రతి సంక్షేమ పతకం అందుబాటులో ఉందని అన్నారు.

## కోరుట్ల డిపో మేనేజర్ గా విజయమాధురి



**కోరుట్ల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

నర్సంపేట డిపో మేనేజర్ గా ఉన్న విజయ మాధురి బదిలీపై కోరుట్ల డిపో మేనేజర్ గా నూతనంగా పదవి బాధ్యతలను బుధవారం స్వీకరించినారు. ఇంతకు ముందు డిపో మేనేజర్ గా పనిచేసిన ప్రసూన లక్ష్మీ కోరుట్ల డిపో నుండి నర్సంపేట డిపో కి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా విజయ మాధురి మాట్లాడుతూ.... కోరుట్ల డిపోను అన్ని రంగాల్లో ముందుంచుతానని డిపోను లాభల బాటలో నడవడానికి కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా వచ్చిన మేనేజరుకు ఆర్టీసీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డితో కలిసి పెండింగ్ బిల్స్ చెల్లించాలని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు ను కలిసిన పీఆర్టీయూటీఎస్ నాయకులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు. సుమారు 5,000 పోస్టులతో త్వరలోనే టిఆర్టి నోటిఫికేషన్ విడుదల.

## ధర్మపురిలో బిజేపి బస్తి బాట



**ధర్మపురి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బిజెపి ధర్మపురిలో బస్తీబాట కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఎస్సీ కాలనీలో గడప గడపకు తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి భరోసా ఇచ్చినారు. దళితులకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు,దళిత బంధు, దళితులకు మూడెకరాల భూమి అని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చి మరిచిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పట్టణ అధ్యక్షులు సంగేపు గంగారం, బెజ్జారపు లవన్, ధర్మపురి పట్టణం ఇన్చార్జి మర్రిపేల్లి సత్యం, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓరగంటి చంద్రశేఖర్, దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేష్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బండారి లక్ష్మణ్, ఓబిసి మోర్చా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, వీరేశం, పల్లెర్ల సురేందర్, గాజు భాస్కర్, డివిటి శ్రీధర్, శ్యామ్ రావు నాగులు, కిరణ్, ఆనందాసు నవీన్, మండలజు సూరజ్, బండారి గణేష్, సంగీ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ లో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ రఘువర్ సింగ్ ను కలిసిన మాజీ మంత్రి, రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ ఛైర్మన్ జి. రాజేశం గౌడ్

## ఆదుకుంటే సాధించింది ఉద్యోగం సాధించి సీఎం సహాయనిధికి రూ. లక్ష విరాళం

### - సీఎం కు అందించిన 'రుద్ర రచన'అభినందించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

జగిత్యాల నియోజకవర్గ రాయికల్ పట్టణానికి చెందిన రుద్ర రచన చిన్ననాడే తల్లి దండ్రులనీ కోల్పోయినా కష్టపడి చదివి హాస్టల్ ఫీజు కట్టలేని స్థితిలో ఉండి కెటిఆర్ కి తన పరిస్తితి పై ట్విట్టర్ ద్వారా ట్వీట్ చేయగా స్పందించిన కేటీఆర్ కళాశాల, హాస్టల్ ఫీజు చెల్లించడమే కాక పూర్తి భాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చి తన భాధ్యత నెరవేర్చగా కేటీఆర్ సహకారంతో చదివి నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం సాధించి, ఆమె జీతంలో నుండి సీఎం సహాయనిధికి లక్ష రూపాయల విరాళంను సీఎం కేసిఆర్ కు అందజేయగా నేడు జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో రుద్ర రచన మర్యాద పూర్వకంగా కలవగా పుష్ప గుచ్చం అందజేసి, అభినందించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. వెంట నాయకులు కోత్తకొండ తిరుపతి గౌడ్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, మాజీ లైబ్రరీ డైరెక్టర్ చేట్ పల్లి సుధాకర్, తదితరులు ఉన్నారు.

# కష్టజీవుల ఆకలి కేక 'గద్దర్ పాట' హుస్నాబాద్ లో ప్రజా సంఘాల నివాళి



**హుస్నాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

కష్టజీవుల కన్నీటి గాథలను పాటగా ఆలపించి, నిరంతరం శ్రమజీవుల పక్షాన పోరాడిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఇటీవల మరణించిన గద్దర్ మరియు సియాసత్ ఎడిటర్ జహీర్ అలీఖాన్ లకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కన్నీటి నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ దేశంలో పేదరిక నిర్మూలన కోసం గద్దర్ ఎంతో ఆకాంక్షించాడని అన్నారు. ప్రజలందరికీ సమాన హక్కులు ఉండాలని ఆరాటపడ్డాడని అన్నారు. హుస్నాబాద్ కి గద్దర్ కి ఎంతో అనుబంధం ఉందని తెలిపారు. శిథిలమైన స్థూపాన్ని పునర్ నిర్మించి, అక్కడ గద్దర్ విగ్రహాన్ని నెలకొల్పాలని అన్నారు. ట్యాంక్ బండ్ పైన గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజాస్వామిక వాది జహీరుద్దీన్ కి ఘనంగా నివాళులు అర్పించారు. ముక్కెర సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కేడం లింగమూర్తి, మేకల వీరన్న యాదవ్, కొయ్యడ కొమురయ్య, పందిల్ల శంకర్, వెన్న రాజు, చింతల రామచంద్రం, గొర్ల ఐలేష్ యాదవ్, రషీద్ ద్రావిడ్, రాయబోసు, బూరుగు కిష్టస్వామి, సతీష్, గద్ద సంపత్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నాయకులు కోమటి సత్యనారాయణ, పోలోజు రవీందర్, అక్కు శ్రీనివాస్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల నిధుల మంజూరి పత్రాలను అందజేసిన డా. కల్వకుంట్ల సంజయ్

**మెట్ పల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

మండలంలోని మేడిపల్లి గ్రామంలో నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి మహిళ సంఘ భవనానికి మూడు లక్షలు రూపాయలు, విశ్వబ్రాహ్మణ సంఘ అభివృద్ధికి రెండు లక్షలు, యాదవ సంఘం భవన అభివృద్ధికి రెండు లక్షలు, బాగోతుల సంఘం-1 మరియు బాగోతుల సంఘం -2 బోరు మరియు మోటర్ల కొరకు మూడు లక్షల అరవై వేల రూపాయలు, ఐకెపి మార్కెట్ యార్డ్ ఫ్లాట్ ఫామ్ కొరకు రెండు లక్షలు, అంబేద్కర్ యువజన సంఘ భవన నిర్మాణ అభివృద్ధికి లక్ష యాభై వేల రూపాయలు, మాల సంఘ భవన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి లక్ష యాభై వేల రూపాయలు మంజూరీ పత్రాలను డా. సంజయ్ ఆయా సంఘాల నేతలకు అందజేశారు. సత్తక్కపల్లె గ్రామంలో కమాన్ (స్వాగత తోరణం) నిర్మాణ అభివృద్ధికి రెండు లక్షల యాభై వేల రూపాయలు, చెరువు దగ్గర గల కల్వర్టు నిర్మాణానికి ఐదు లక్షలు, రామాలయ కమ్యూనిటీ హాల్ కొరకు రెండు లక్షలు, రాజేశ్వరరావు పెట్ గ్రామంలో గల జంగిటి సంఘ భవన నిర్మాణానికి మూడు లక్షలు, పెద్దమ్మ తల్లి దేవాలయం దగ్గర



కమ్యూనిటీ హాల్ కొరకు రెండు లక్షలు, చెర్లకొండాపూర్ గ్రామంలో గల డ్రైనెజి నిర్మాణానికి మూడు లక్షలు, కమ్యూనిటీ హాల్ కొరకు మూడు లక్షలు, చెర్ల కొండాపూర్ మరియు బండలింగపూర్ గ్రామల మధ్యలో కల్వర్టు నిర్మాణానికి నాలుగు లక్షలు మొత్తం 40 లక్షల రూపాయల విలువ గల ప్రొసీడింగ్ పత్రాలను బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ వారికి అందజేశారు. కార్యక్రమంలో మెట్ పల్లి మండల ఎంపీపీ మారు సాయి రెడ్డి, మెట్ పల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు నల్ల తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బంధు నిరంతర ప్రక్రియ ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం అందుతుంది

### - ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



**హుస్నాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

దేశంలోని మొట్టమొదటిసారిగా బీసీల ఆర్థిక స్వావలంబన, కులవృత్తుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ బందు పథకం ప్రవేశపెట్టారని, ఎంపికైన ప్రతి లబ్ధిదారునికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని హుస్నాబాద్ మున్సిపల్ మరియు హుస్నాబాద్ మండలం, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు చెందిన 295 మంది లబ్ధిదారులకు బీసీ బందు పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....నియోజకవర్గంలో 7232 మంది బిసి బంధు కు అప్లై చేసుకోగా 6022 మందిని లబ్ధిదారులుగా గుర్తించామని ఈరోజు 295 చెక్కులు పంపిణీ చేస్తున్నామని ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ఎవరు ఆందోళన పడవలసిన పని లేదు అర్హులైన ప్రతి ఒక్కరికి బీసీ బంధు అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు పదివేల రూపాయల రుణం కోసం బ్యాంకుల చుట్టూ పడిగాపులు కాస్తూ, గ్యారంటీల కోసం ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండేవన్నారు. నేడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో మొట్ట మొదటిసారి కుల వృత్తుల అభివృద్ధి కోసం ఎలాంటి హామీ లేకుండా తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి పైసా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అభిలాషించారు. దళిత బంధు, బీసీ బంధు, రైతులకు రైతు బీమా, రైతు బంధు, రుణమాఫీ వివిధ సంక్షేమ కార్యక్రమాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి విధంగా అద్భుతంగా పరిపాలన సాగిస్తూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# బహుజన సమాజ్ పార్టీ అత్యవసర ఈసీ మీటింగ్



**జమ్మికుంట ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

బహుజన సమాజ్ పార్టీ అత్యవసర ఈసీ మీటింగ్ లో ఎజెండా 1. ప్రతి ఆదివారం గ్రామ కూడలిలో జండా గద్దె కట్టడం, 2. పోలింగ్ బూతు కమిటీలు వేయడం, 3. ఇంటింటికి బిఎస్పి పరిచయం ప్రచార రథం ప్రతిరోజు తింపడం, 4. 18 తారీకు రోజున సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని పురస్కరించుకొని గౌడ్ అన్నల సమూహానికి పోయి సర్దార్ సర్వాయి పాపన్న త్యాగం గురించి చెప్పడం తీపి పంపకాలు పంచడం జరపాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి హుజురాబాద్ అసెంబ్లీ ఇన్చార్జి మారేపల్లి మొగులయ్య, మరో అసెంబ్లీ ఇన్చార్జి దొడ్డ శ్రీనివాస్, జిల్లా మహిళా కన్వీనర్ మిడిదొడ్డి సప్న, మరో జిల్లా మహిళా కోకన్వీనర్ కవ్వంపల్లి లలిత, జిల్లా ఈసీ మెంబర్ పెరిక శ్రీనివాస్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు మంద సమ్మయ్య, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఈదునూరి రమేష్, అసెంబ్లీ కార్యదర్శి రాచపెల్లి రఘుపతి, జమ్మికుంట మండల అధ్యక్షులు రాచపల్లి రమేష్.

# బీసీ బందు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ఎల్కతుర్తి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

ఎల్కతుర్తి మండల కేంద్రంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు హుస్నాబాద్ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ తో కలిసి హుస్నాబాద్ ఎంపీడీవో ఆఫీస్ నందు బిసి బందు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల స్వప్న సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ రైల్వే బోర్డు సభ్యులు యేల్తూరి స్వామి రైతుబంధు సమితి మండల అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కడారి రాజు ఎంపిటిసిలు వేముల రజిని వెంకన్న భవాని దేవేందర్ రావు అనూష ఎంపీపీ మేకల కోమల మండల సీనియర్ నాయకులు పిట్టల మహేందర్, గుండా ప్రతాప్ రెడ్డి, చదిరం లోకిన్ సూరయ్య,



నాగేశ్వర్, ఖమ్రుద్దీన్, యూత్ కన్వీనర్ మహిపాల్ రెడ్డి ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి కేసీఆర్ కి హుస్నాబాద్ శాసనసభ్యులు సతీష్ కుమార్ కి ఋణపడి ఉంటామని తెలిపారు.

## సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



**మెటుపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

మెటుపల్లి పట్టణంలో 4వ వార్డులో 20 లక్షలతో 14 ఆర్థిక సంఘం నిధుల నుండి నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత సత్యనారాయణ ప్రారంభించారు. చైర్ పర్సన్ రాణవేణి సుజాత సత్యనారాయణ మాట్లాడుతూ.... ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సహకారంతో మెటుపల్లి పట్టణ అన్ని వార్డులలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అత్యధిక నిధులు మున్సిపాలిటి కు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మంజూరు చేయించారని, వారి సహకారంతో అన్ని వార్డులు పనులు పూర్తి అవుతున్నాయని ఆమె అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర రావు , కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, లంక గంగాధర్, డిఈ రాజ్ కుమార్, మార్గం మహేందర్, మహేష్ మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్స్ ఏ.ఎస్.ఐ గా ఎంపికైన కానిస్టేబుల్అభినందించిన జిల్లా ఎస్పీ



**జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఫింగర్ ప్రింట్స్ ఏ.ఎస్.ఐ. గా ఎంపికైన కానిస్టేబుల్ కిరణ్ ను జిల్లా ఎస్పీ భాస్కర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూ పట్టుదలతో శ్రమించి విజయం సాధించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, పెన్నుల వితరణ



**జనగామ ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

జనగామ వనిత క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం వనపర్తి జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, పెన్నుల వితరణ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్దేశించి వనిత క్లబ్ గ్రేటర్ జనగామ అధ్యక్షురాలు డాక్టర్ వరూధిని మధంశెట్టి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని తెలుపుతూ ఈనాటి కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన వనపర్తి గ్రామవాసి, ఆర్యవైశ్య ముద్దుబిడ్డ ములుగు నాగరాజు ఉషారాణి సహకారంతో నిర్వహించమన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి గంగిశెట్టి అనుజ, విస్తరణ అధికారి డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, పడకంటి రవీందర్, పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి నిజ శ్రావణమాసం ప్రారంభం



**జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

నిజ శ్రావణమాసం ప్రారంభం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా శివాలయాలన్నీ సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. ఉదయం నుండి శివాలయాల్లో మూలమూర్తికి పంచామృతాలతో అభిషేకించనున్నారు. భక్తులు ఇప్పటికే అభిషేకాలు తమ పేరిట చేసుకోవడానికి ఆలయాల్లో తమ గోత్రనామ దేయాలను చేర్చుకున్నారు. బ్రాహ్మణ వీధి హరిహరాలయంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సంప్రదాయబద్ధంగా భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేస్తున్నారు.

# ప్రధాన సమస్యలపై చిత్తశుద్ధిలేని పాలకులు

వచ్చే ఏడాది జరిగే స్వాతంత్ర్య ఉత్సవాల్లోనూ తానే త్రివర్ణ పతాకం ఎగురేస్తానని, మరోమారు ఆశీర్వ దించాలని ప్రధాని మోడీ చేసిన ప్రకటనపై విమర్శలు ఎలా ఉన్నా.....దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలపై ప్రధాని మోడీ ఎక్కడా తన ప్రసంగంలో ప్రకటించలేదు. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై ప్రస్తావనా లేదు. ఉత్తరాదిలో అతలాకుతలం చేసిన వరదలు, కొండచరియలు విరిగి పోవడం, మణిపూర్‌లో ఊచకోతలు, ధరల పెరుగుదల,నిరుద్యోగం, ఆర్థికమాంద్యం కోసం తీసుకునే చర్యల గురించి ప్రస్తావించ లేదు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ ప్రస్తావించిన అంశాలు ఏవీ అమలుకాలేదు. ఇప్పుడు కొత్తగా మరో 25 ఏళ్ల దార్శనికత గురించి చెబితే ప్రజలు నమ్ముతారా అన్నది ఆలోచించడం లేదు. ధరల పెరుగుదల, రూపాయి పతనం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం ఇప్పుడు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటోందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక కావాలి. ప్రధాని మోడీ ఈ విషయాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. ఎర్రకోట ప్రసంగంలోనూ వీటి గురించి ప్రస్తావించలేదు. వీటిని ఎలా అధిగమించ బోతున్నారో కూడా చెప్పలేదు. గతంలో చెప్పిన వాగ్దానాలేవీ అమలుకాలేదు. తన ప్రభుత్వం సాధించిన విజయాలను,చేపట్టిన సంక్షేమ పథకాలను, సంస్కరణలను ఎంతగొప్పగా చెప్పినా పొయ్యిలో పిల్లి లేవని కుటుంబాలు కోకొల్లలు. ఇన్ని చెప్పిన ప్రధాని మోడీ మన రూపాయికి శస్త్రచికిత్స చేసే విషయాన్ని మరచి పోయారు. రూపాయి రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నా ప్రస్తావించడంలేదు. రూపాయి విలువ పెరగ లేదు సరికదా మరింత దిగజారుతున్నా పట్టుకుని నిలపాలన్న తపన కానరావడం లేదు. కనీసం దానిని తాను అధికారం చేపట్టిన నాటి స్థాయికి తీసుకుని వద్దామన్న ప్రయత్నం కూడా జరగడం లేదు. ఈ మాంద్యాన్ని గమనించి అడుగులు వేద్దామన్న చిత్తశుద్ధి కానరావడం లేదు.అందుకే మోడీ ఎర్రకోట ప్రసంగం పై ఎక్కడా ఆసక్తి గానీ, ఆయన పిలుపుపై స్పందన గానీ కానరావడం లేదు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి తొలినాళ్ల హామీలను ఇప్పుడు ఎక్కడా ప్రస్తావించడం లేదు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగంపైనా ప్రధాని పెదవి విప్పడంలేదు. ఇలా సమస్యలు వెన్నాడుతున్నా.. ప్రజలను పట్టించుకోకుండా రానున్న ఏడాది తానే మళ్లీ జెండా ఎగురేస్తానని చెప్పడం ద్వారా మరోమారు వంచించడం తప్ప మరోటి కాదు. వంచనలతో పాలన చేయలేమని మోడీతో పాటు,రాష్ట్రాల సిఎంలు కూడా గుర్తించాలి. నిరుద్యోగం,ద్రవ్యోల్బణం, జీఎస్టీలతో నిలువుదోపిడి చేస్తున్న తీరుపై స్పష్టత లేకుండా ఎంతకాలం మోసం చేస్తారు. అచ్ఛేదిన్ వాగ్దానం చేసి మరచిపోతే ఎలా అన్నది మోడీ గుర్తు చేసుకోవాలి. పాలకులు తాముచేసిన వాగ్దానాలపై కసరత్తు చేయ కుండా మరింతగా ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎలా అన్నది మననం చేసుకోవాలి. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్.. అమృత్ కాల్, ఆజాదీకా అమృత్ మహోత్సవం ఇలా నినాదాలతో ప్రజల కడుపులు నిండవని గుర్తించాలి. అవరోధాలను, అవకాశాలను పారదర్శకంగా చర్చించి, భవిష్యత్ మార్గాన్ని సూచించడం విజ్ఞత అవుతుంది. కానీ సమస్యలను ముందు పెట్టుకుని వాటిని లేనట్లుగా చూపడం మోసం అవుతుంది. దేశ ఆర్థిక పరిస్థితి గతంలో ఓమారు దిగజారిన వేళ అప్పట్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పివి నరసింహారావు నడుం బిగించి చక్కదిద్ది, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పడిపోతున్న రూపాయిని పట్టుకుని లేపారు. విదేశీమారక నిల్వలను నిలబెట్టారు. ఇప్పుడలాంటి చొరవ కానీ, దక్షత కానీ పాలకలుకు లేకుండా పోయింది. కనీసం ఎందరికో భారతరత్నలు ఇస్తున్న ప్రభుత్వం పివి దార్శనికతను గుర్తించి..

ఆయనను గౌరవించక పోవడం దారుణంకాక మరోటి కాదు. కనీసం ఆయన చూపిన దక్షతనయినా పునికిపుచ్చుకోవడం లేదు. అనుత్పాదక రంగాలకు నిధులను వేలం వెర్రిగా ఖర్చు చేస్తూ పోవడం, దిగుమతులు పెంచడం వంటి చర్యలు దేశీయంగా ఆర్థికరంగాన్ని దెబ్బతీస్తూ వస్తోంది. ఉచిత పథకాలకు మంగళం పాడాల్సింది పోయి వాటిని పెంచుతున్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం చేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోని నేతల కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిం టోంది. తాజాగా మరోమారు ఇలాంటి భయాలు వస్తున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలు పూనుకోకుండా నినాదాలకే పరిమితం కావడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం కాక మరోటి కాదు. ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను పొదుపు చేసి, ఆ నిధులను పెట్టుబడులుగా ఉపయోగించి, వస్తుసేవల ఉత్పత్తినీ, ఎగుమతులనూ వృద్ధి చేసినప్పుడు మాత్రమే స్థిరమైన ప్రగతిని సాధించగలం.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్ " లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు....

-ఎడిటర్

## అయ్యా.. నేను చదువుకొంటానయ్యా...

బారెడు పొద్దెక్కింది పాలేరు సాంబయ్య ఇంకా పనిలోకి రాలేదని లక్ష్మీపతి కాలు కాలిన పిల్లిలా ఇంట్లో అటు ఇటు తిరగుతున్నాడు.ఎంతకు సాంబయ్య రాకపోయేసరికి కబురు పెట్టించాడు అయినా సాంబయ్య రాలేదు.దానితో పాలేరు ఇంటికి వెళ్లి కోపంతో "ఒరేయ్!సాంబ! ఏం ఒళ్ళు కొవ్వెక్కిందా! పనులు ఎవడు చేస్తాడనుకున్నావురా!మీ అయ్యేమో తీసుకున్న అప్పు తీర్చకుండానే చచ్చాడు. నీవు చేసే పనికి వచ్చే జీతం వడ్డికే సరిపోవడం లేదు.ఇలా పనులు ఎగ్గొడితే ఇక అప్పు ఈ జన్మకు తీరినట్టే నడురా ముందు నడువు" అని అరిచాడు.

"అయ్యగారు! మరి....మరి...నేను మా ఆవిడా బుడ్డోడు కిట్టి గాడిని తీసుకుని పట్నం వెళ్తున్నామయ్యా! అక్కడ నాలుగు డబ్బులు సంపాదించి మీ అప్పు తీర్చేస్తామయ్యా. మా కిట్టిగాడికి చదువు అంటే చాలా ఇష్టం అయ్యా! ఇక్కడ ఇల్లుగడవక వాడిచేత గొర్రెలు కాయిస్తున్నానయ్యా!అక్కడైనా ఆడికి చదువు చెప్పిస్తానయ్యా".అని బ్రతిమలాడాడు సాంబయ్య."ఏంట్రా మతుండే మాట్లాడుతున్నావా! నీ అయ్య అప్పు తీర్చకుండా చచ్చాడు.నువ్వు అప్పు ఎగ్గొట్టాలని చూస్తున్నావు. ఈ ఊరు విడిచి పోతే బాకి ఎవడు తీరుస్తాడురా? మర్యాదగా అప్పు తీర్చే వరకు నా దగ్గర పాలేరుగా పడి ఉండు. లేదంటే, నా అప్పు తీర్చి ఈ ఊరి నుంచి కదులు"అని కేకలేశాడు లక్ష్మీపతి.

"అయ్యగారు !మీ కాలుమొక్కుతా పట్నమెల్లి మీ బాకీ అణా పైసలతో సహా తీర్చేస్తాను కనికరించండయ్యా!"అని సాంబయ్య కాళ్లావేళ్ళా పడ్డాడు. "సరే నువ్వు ఇంత ఇదిగా కాళ్ళావేళ్ళా పడి బ్రతిమలాడుతున్నావు గనుక నిన్ను పంపిస్తున్నాను. అంతవరకు నీ కొడుకుని నా దగ్గర పాలేరుగా ఉంచుకుంటున్నాను" అని బలవంతంగా కిష్టయ్యను లక్ష్మీపతి ఈడ్చుకు పోతుంటే, "అయ్యా! అయ్యా! నేను పట్నంలో చదువుకుంటానయ్యా నన్ను విడిపించి తీసుకెళ్లయ్యా! " అని అంటున్న కొడుకు మాటలకు సాంబయ్య ఏమి చెయ్యలేక బాధపడుతూ కొడుకుని చదివించలేకపోయాను, సరికదా పాలేరుని చేశాను అని గుండెలవిసేలా కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ కూలబడిపోయాడు.

లక్ష్మీపతి కిష్టయ్యతో గొడ్డుచాకిరీ చేయిస్తున్నాడు. ఆ కష్టాలు భరించలేక కుమిలి కుమిలి ఏడ్చేవాడు కిష్టయ్య. తన ఈడు పిల్లలు ఆడుతూ పాడుతూ ఆనందంగా చదువుకుంటుంటే వారి లాగే చదువుకోవాలనిఎంతో ఆరాటపడే వాడు.చాటు మాటుగా తోటి పిల్లల దగ్గర చదువు నేర్చుకునే వాడు.అది ఒకనాడు లక్ష్మీపతి కంట పడింది."ఏరా ! నీకు చదువు కావాల్సి వచ్చిందా! మీ లాంటి వాళ్ళు చదువుకుంటే మా పనులు ఎవడు చేస్తాడ్రా!" అంటూ కోపంతో పూనకం వచ్చినట్టు ఊగిపోతూ విచక్షణారహితంగా కొట్టాడు.పాపం కిష్టయ్య ఆ బాధలన్ని భరిస్తూ బండెడు చాకిరీ చేసేవాడు.



ఒకరోజు పోలీసులు లక్ష్మీపతిని అరెస్ట్ చేయడానికి వచ్చారు. లక్ష్మీపతి ఆశ్చర్యపోతూ "నేను చేసిన తప్పేంటి !నన్ను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారు" అని అడిగాడు."మీరు 14సం.ల లోపు పిల్లాడితో పని చేయిస్తున్నట్టు మాకు కంప్లైంట్ వచ్చింది.మా పోలీసులు విచారించగా మీరు పిల్లాడితో పని చేస్తున్నారన్న మాట నిజమని తెల్సింది.ఇది బాల కార్మిక చట్ట రీత్యా నేరము .అందుకు గాను మీకు 5 నుండి10 సం.రాలు జైలు శిక్ష మరియు జరిమానా కూడా విదించే అవకాశముంది"అని అన్నారు పోలీసులు.

"ఇంతకి నా మీద కంప్లైంట్ ఇచ్చింది ఎవరండి"మీ ఇంట్లో పని చేస్తున్న కుర్రాడే మాకు కంప్లైంట్ ఇచ్చాడు.ఏరా! నా మీదే ఎదురు తిరిగేంత మొనగాడివి అయ్యావే!అసలు నీకిన్ని తెలివితేటలు ఎక్కడినుంచి వచ్చాయి".అసహనంగా అడిగాడు లక్ష్మీపతి."మన ఊరిలోని మాష్టారుగారి దగ్గరకు మీకు తెలియకుండా రాత్రిపూట వెళ్ళే వాడిని. నా ఆసక్తి గమనించి మాస్టారు గారు ప్రత్యేక శ్రద్ధతో చదువు నేర్పారు. సారు దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. వెట్టి చాకిరీ నుండి విముక్తి అయ్యే మార్గాన్ని తెల్సుకున్నాను".అన్నాడు కిష్టయ్య. ఆ మాటలు విన్న లక్ష్మీపతి తెల్లబోయాడు. పోలీసులు లక్ష్మీపతిని అరెస్ట్ చేసి, కిష్టయ్యకు విముక్తి గావించి ప్రభుత్వ అధ్వర్యంలో నడిచే రెసిడెన్షియల్ బ్రిడ్జ్ కోర్స్ లో చేర్పించారు.

ఇప్పుడు కిష్టయ్య అందరిలానే ఆడుతూ పాడుతూ చక్కగా చదువుకుంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నాడు.

**ద్వారపురెడ్డి. జయరాం నాయుడు**
**కైకలూరు .9441519570**

## భారత పాకిస్థాన్ మధ్య చిచ్చు పెట్టిన హద్దుల విభజన

### ఆగస్టు 17... భారత్, పాక్ మధ్య విభజన దినం



రాడ్ క్లిఫ్ రేఖ అంటే చాలా మందికి తెలియక పోవచ్చు. అది భారత, పాకిస్తాన్ మధ్య విభజన రేఖ. సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ నేతృత్వంలోని సరిహద్దుల కమిషన్ ఈ రేఖను నిర్ధారించింది. రాడ్ క్లిఫ్ రేఖ 1947 ఆగస్టు 17న భారత దేశ విభజన అనంతరం భారత పాకిస్తాన్ ల నడుమ సరిహద్దు రేఖగా ఏర్పరచారు. భారత్ లో బ్రిటిష్ రాజ్యం మరో నెల రోజుల్లో, అంటే 1947 ఆగస్టు 15న ముగుస్తుందని భారత స్వాతంత్ర్య చట్టం, 1947 ద్వారా బ్రిటిష్ పార్లమెంటు 1947 జూలై 15న పేర్కొంది. భారత దేశాన్ని రెండు భాగాలుగా విభజించాలని కూడా అది వివరించింది. పాకిస్తాన్ ముస్లింల రాజ్యంగా కొనసాగాలని, అదే సమయంలో భారత్ హిందూ మెజారిటీతో కూడిన లౌకిక రాజ్యంగా ఉండాలని ఉద్దేశించారు. ఉత్తరాదిన ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతాలు పాకిస్తాన్ గా రూపుదిద్దు కోవాలని నిర్ణయించారు. బలూచిస్థాన్ (విభజనకు ముందు 91.8 శాతం ముస్లిం జనాభా), సింధ్ (72.7 శాతం ముస్లిం జనాభా) ప్రావిన్సులను పూర్తిగా పాకిస్తాన్ కు కేటాయించారు. అయితే, ఈశాన్య బెంగాల్ (54.4 శాతం ముస్లింలు), వాయవ్యాన పంజాబ్ (55.7 శాతం) ప్రావిన్సుల్లో పూర్తిగా ముస్లిం మెజారిటీ లేకపోయింది. దాంతో పంజాబ్ పశ్చిమ భాగం పశ్చిమ పంజాబ్ మారింది. తూర్పు ప్రాంతం పంజాబ్ రాష్ట్రం పేరుతో భారత్ లో అంతర్భాగమైంది. బెంగాల్ కూడా అదే మాదిరిగా తూర్పు బెంగాల్ పాకిస్తాన్ లో, పశ్చిమ బెంగాల్లో భారత్ లో విలీనమైంది. ఇక పంజాబ్ లో జనాభా విస్తృతి సంక్లిష్టంగా ఉంది. దాంతో దాన్ని హిందూ, ముస్లిం, సిక్కుల ప్రాంతాలుగా స్పష్టంగా విభజించ లేని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా మహ్మదాలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్, జవహర్ లాల్ నెహ్రూ, పటేల్ సారథ్యం లోని భారత జాతీయ కాంగ్రెస్, బ్రిటిష్ వారందరినీ సంతృప్తి పరిచే విభజన ప్రణాళిక కూడా ఏదీ లేకపోయింది. వీలనంత త్వరగా భారత్ ను విడిచి వెళ్లిపోవడమనే బ్రిటిష్ ప్రభుత్వ తక్షణావసరాల కారణంగా ఐక్యరాజ్య సమితి వంటి బయటి సంస్థల నిపుణులకు సరిహద్దు నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం లేకపోయింది. భారత వైస్రాయిగా పనిచేసిన లార్డ్ వేవెల్, అంతకు ముందు 1947 ఫిబ్రవరిలో లార్డ్ లూయిస్ మౌంట్బాటెన్ అప్పటికే ఒక సరిహద్దు రేఖను సిద్ధం చేశారు. రెండు దేశాలకు ఏయే ప్రాంతాలను అప్పగించాలో ఇదమిత్థంగా నిర్ధారించేందుకు 1947 జూన్ లో సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ ను బెంగాల్, పంజాబ్ సరిహద్దు కమిషన్ల రెండింటికీ చైర్మన్ గా బ్రిటన్ నియమించింది. పంజాబ్ లో ముస్లిం, ముస్లిమేతర మెజారిటీ ప్రాంతాలను వీలైనంత స్పష్టంగా విడదీస్తూ ఇరు ప్రాంతాల మధ్య సరిహద్దులను నిర్ధారించా ల్సిందిగా కమిషన్ కు సూచనలందాయి. 1947 జులై 8న ఢిల్లీలో అడుగు పెట్టిన రాడ్ క్లిఫ్.. ఆగస్టు 12 నాటికి పూర్తి చేశారు. భారత్ గురించి ఏ మాత్రం తెలీకుండా.. చివరకు బెంగాల్.. పంజాబ్ ప్రాంతాలు ఎక్కడ ఉంటాయో కూడా తెలీకుండానే రాడ్ క్లిప్ దేశ విభజనను పూర్తి చేయటం విశేషం. భారత్ గురించి ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి, తనకు చెప్పిన పనిని చెప్పినట్లుగా చేయటం, అందుకు తనకున్న అవగాహనతో గీసిన గీతలు, నిర్ణయించిన హద్దులు, కోట్లాది మంది ప్రజల బతుకుల్ని, భవిష్యత్తును నిర్దేశించాయి. భారీ మారణ హెరీమానికి కారణ మయ్యాయి. జూలై 8న భారత్ వచ్చాక, రాడ్ క్లిఫ్ కు సరిహద్దు నిర్ణయానికి కేవలం 5 వారాలు మాత్రమే ఇచ్చారు. ఆయన వెంటనే తన కాలేజీ సహాధ్యాయి మౌంట్ బాటెన్ ను కలిశాడు. తర్వాత ఇద్దరూ లాహోర్, కలకత్తా వెళ్లి కమిషన్ సభ్యులను కలిశారు. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి నెహ్రూను, ముస్లిం లీగ్ అధ్యక్షుడు జిన్నాను కలుసుకున్నారు. అంత తక్కువ కాలావధి ఇవ్వడాన్ని ఆయన అభ్యంతర పెట్టారు. కానీ ఆగస్టు 15న భారత్ నుంచి బ్రిటిష్ వారు వెళ్లిపోయే లోపే ఈ పని పూర్తవాలని ఇరు వర్గాలూ పట్టుబట్టాయి. దాంతో మరో అవకాశం లేకపోయింది. ఈ తక్కువ డెడ్ లైన్ షరతు మీదే మౌంట్బాటెన్ భారత వైస్రాయి పదవిని అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని బ్రిటిష్ వారు వెళ్లిపోవడానికి కేవలం 2 రోజుల ముందే తీసుకున్నారు. కానీ రాజకీయ కారణాల వల్ల ఆగస్టు 17 దాకా, అంటే భారత్, పాకిస్తాన్లకు స్వాతంత్ర్యం ఇచ్చిన రెండు రోజుల దాకా దాన్ని బయట పెట్టలేదు. రాడ్ క్లిఫ్ తన నియామకానికి ముందు భారత్ ను ఒక్కసారి కూడా సందర్శించ లేదు. ఆయన వ్యక్తిగత కార్యదర్శి క్రిస్టోఫర్ బీమంటకు మాత్రమే పంజాబ్ జీవన విధానం, అక్కడి యంత్రాంగాన్ని గురించిన అవగాహన ఉంది.. తన వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉందని నిరూపించు కోవడానికి గాను కనీసం వైస్రాయ్ మైంట్బాటెన్ కూడా కలవకుండా రాడ్ క్లిఫ్ పూర్తి దూరం పాటించారు. రాడ్ క్లిఫ్ కు కేవలం నెల రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అనుకూలంగా గ్రామాలను విభజించడానికి జాగ్రత్తలు తీసుకునే సావకాశం చిక్కలేదు. ఆయన నిర్ధారించిన సరిహద్దు అస్తవ్యస్తమైంది. కొన్ని ప్రాంతాల మధ్య నుండి కాక నేరుగా వాటి మీదుగా వెళ్లింది. విభజన రేఖ ఒకే ఇంట్లో కొన్ని గదుల్ని భారత్ కు, మరికొన్ని గదుల్ని పాకిస్తాన్ కు కూడా కేటాయిస్తూ సాగిన ఉదంతాలు కోకొల్లలుగా ఉండడం గమనార్హం. రాడ్ క్లిఫ్ తాను భారత్ నుంచి వెళ్లే ముందు ఈ ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలనూ నాశనం చేశాడు. ఆయన స్వాతంత్ర్య దినం రోజునే భారత్ విడిచి వెళ్లిపోయాడు. తాను నిర్ణయించిన సరిహద్దులను సాధికారికంగా ప్రకటించడానికి కూడా ముందే దేశాన్ని వదిలాడు. అన్ని రికార్డులనూ రాడ్ క్లిఫ్ నాశనం చేయగా, మౌంట్బాటెన్ కూడా ఈ విషయాలు తనకేమీ తెలియదని చెప్పారు. విభజన అనంతరం. సరిహద్దు రేఖల నిర్ణయాన్ని అమలు చేసుకోవాల్సిన బాధ్యత భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలపై పడింది. 1947 ఆగస్టు 15న తాము సరిహద్దులకు ఏ వైపుకు చెందామన్నది అక్కడి గిరిజనుల్లో చాలామందికి తెలియక పోవడాన్ని బట్టి ఎంత అవగాహన రాహిత్యంతో విభజించారో అర్థం చేసుకోవచ్చు. చివరికి విభజన అమలు సందర్భంగా... ఉపఖండంలో దాదాపు 1.4 కోట్ల మంది ప్రజలు సొంత ఇళ్లను వదులుకున్నారు. బస్సులు, రైళ్లు, విమానాలు, కార్లు, లారీలు, ఎడ్లబళ్లు, ఇంకా అత్యధికులు కాలి నడకన తమ సొంత వారితో కలిసి ఆవాసాన్ని వెదుక్కునేందుకు బయల్దేరారు. వారిలో చాలామంది అవతలి పక్షం వారి చేతుల్లో హత్యకు గురయ్యారు. మరికొందరు ఆకలికి తాళలేక ప్రాణాలు విడిచారు. ఇంకా కొంతమంది ప్రాణాంతక వ్యాధులకు బలయ్యారు. ఈ మొత్తం ప్రక్రియలో మరణించిన వారి సంఖ్య కనీసం 2 లక్షల (ఇది ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం పేర్కొన్న గణాంకాలు) నుంచి 20 లక్షల దాకా ఉంటుందని అంచనా వేశారు. అంతిమంగా ఈ సరిహద్దు వివాదాలే భారత్, పాకిస్తాన్ మధ్య 1947, 1965, 1971ల్లో యుద్ధాలకు కూడా దారితీశాయి. 1998 మేలో కూడా ఇరు దేశాలూ అణ్వాయుధ పరీక్షలు జరిపేందుకు, 1999లో కార్గిల్ యుద్ధానికి కూడా అవే కారణమయ్యాయి. నాటి తొందరపాటు చర్యలతో అస్తవ్యస్త విభ జన ఫలితంగా నేటికీ భారత పాకిస్థాన్ దేశాల మధ్య వివాదాలు కొన సాగుతూ, పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే స్థితి నెలకొని ఉంది.




రామ కిష్టయ్య సంగన భట్ల..
9440595494

# 'ప్రజా గాయకుడు' గద్దర్

ప్రజా గాయకుడు గద్దర్ గోచి, గొంగళి ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టి, రగల్ జెండా చేతపట్టి 'జననాట్యమండలి' అనే విప్లవ సాంస్కృతిక సంస్థ ద్వారా భూస్వామ్య, దోపిడి, పెట్టుబడి మరియు సామ్రాజ్యవాద వ్యవస్థలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలను విప్లవోన్ముఖులను గావించి తన జీవితం చివరి దశలో ప్రజాస్వామ్య బాటలో పయనించి ఈ నెల 6 వ తేదీనాడు అమరుడు కావడం విషాదకరం. ఆయన మరణం ప్రతి ఒక్కరిని తీవ్రంగా కలచివేయడమే కాకుండా ముఖ్యంగా సాహిత్య, సాంస్కృతిక రంగాలకు మరియు పీడిత ప్రజానీకానికి తీరని లోటుని కలిగించింది.

గద్దర్ అనే మారుపేరుతో ప్రాచుర్యం పొందిన 'గుమ్మడి విఠల్ రావు' అనే ఒక సామాన్యమైన మానవుడు మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలోని అంటరాని దళిత కుటుంబంలో గుమ్మడి లచ్చుమమ్మ, గుమ్మడి శేషయ్య అనే దంపతులకు 1948, జనవరి 30 నాడు జన్మించారు. తూప్రాన్ తాలుకాలో హెచ్.ఎస్.సి పాసైన తొలి దళిత విద్యార్థిగా విఠల్ పేరు పొందారు. తర్వాత సైఫాబాద్ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పి.యు.సి (ఎం.పి.సి)లో 77 శాతం మార్కులతో డిస్టింక్షన్ ని సాధించారు. 1968 లో ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజ్ లో సీటు సాధించి సరికొత్త చరిత్రని సృష్టించారు . అయితే ఆర్థికపరమైన సమస్యల కారణంగా ఆయన ఆ ఇంజనీరింగ్ కోర్స్ ని మధ్యలోనే వదిలేసి ప్రభుత్వ క్షేత్ర ప్రచార శాఖలో కుటుంబ నియంత్రణ బుర్రకథలు చెప్తున్న క్రమంలోనే విఠల్ కి 'ఆర్ట్స్ లవర్స్' అనే ప్రగతిశీల సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు బి.నరసింగరావు కళా సాన్నిహిత్యం లభించడంతో ఆయన 1970 లో ఆ ఆర్ట్ లవర్స్ సంస్థలో చేరి క్రమంగా గుమ్మడి విఠల్ 'గద్దర్'గా పరిణామం చెందారు.



నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాలు లవర్స్ సంస్థని క్రమంగా 'జనానాట్యమండలి'గా రూపుదాల్చడంతో గద్దర్ ఆ జనానాట్యమండలి వెలుగు లో అంబేద్కరిజం నుండి క్రమంగా 'మార్క్సిజం- లెనినిజం- మావో ఆలోచనా విధానం' దిశగా పరివర్తన చెందారు. 1985-89 వరకు పూర్తిగా ఆట- పాట- మాట బంద్ కావడంతో జననాట్యమండలి బహిరంగంగా పనిచేయని విషమ పరిస్థితులు తలెత్తడంతో గద్దర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 1990, ఫిబ్రవరి 18 వ తేదీన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంతో గద్దర్ తిరిగి బహిరంగ జీవితంలోకి ప్రవేశించారు. 1995 లో పీపుల్స్ వార్ పార్టీ గద్దర్ ని పార్టీ నుండి బహిష్కరించి ననూ క్రమంగా తిరిగి పార్టీలోకి చేర్చుకోవడం గమనార్హం. 1995 లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడంతో గద్దర్ తెలంగాణ రాష్ట్ర సాధన ఆవశ్యకతను తెలియజేస్తూ పాటలు రాసి పాడారు. మృతదేహాల స్వాధీన కమిటీ కన్వీనర్ గద్దర్ బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో ఒక దశలో 'పాడెపై పడుకొని మృతదేహాలను అప్పగించేదాకా కదిలేది లేదు' అని పేర్కొని 'ఎన్ కౌంటర్ లు అన్నీ రాజకీయ హత్య'లే అనే స్థాయికి గద్దర్ నినాదాన్ని ముందుకు తీసుకెళ్లారు.

1997,ఏప్రిల్ 6 వ తేదీ నాడు అగంతకులు గద్దర్ పై కాల్పులు జరపడంతో ఆయన తృటిలో తప్పించుకొని మృత్యువుని జయించి తనపై జరిగిన దాడికి ఏమాత్రం వెనుకంజ వేయకుండా విప్లవోద్యమంలో మరింతగా మమేకమై ముందుకు సాగారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నక్సలైట్ పార్టీల మధ్య జరిగిన శాంతి చర్చలలో గద్దర్ తనవంతు పాత్రని నిర్వహించారు. 2004 చివరి నుండి గద్దర్ తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో మమేకమై 'ధూమ్ ధామ్'కి గైడెన్స్ అందించారు. 2007, ఫిబ్రవరి 2 నాడు గద్దర్ హైదరాబాద్ లోని అసెంబ్లీ అమరవీరుల స్మారక స్థూపం నుండి 'శాంతియాత్ర'ని ప్రారంభించి సఫలీకృతంగా ముందుకు సాగి సరికొత్త చరిత్ర సృష్టించారు. మార్క్సిస్ట్- లెనినిస్ట్- మావో సిద్ధాంతాల తాత్విక దృక్కోణాలతో పురోగమించిన గద్దర్ తాను చైర్మన్ గాను 2010, అక్టోబర్ 9 నాడు హైదరాబాద్ లో 'తెలంగాణ ప్రజా ఫ్రంట్' ఆవిర్భవించింది 'ఉద్యమాల ద్వారానే తెలంగాణ వస్తుంది' అనే గీటురాయికి ఆయన నాయకత్వం వహించి ప్రజలను చైతన్యవంతులను చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక గద్దర్ సామాజిక తెలంగాణ సాధన కోసం ఉద్యమించారు. కాలక్రమంలో ఆయన ప్రజాస్వామ్య బాటలో అడుగులు వేసి ఓటు హక్కుని నమోదు చేసుకున్నారు. ఇటీవల ఆయన రాజకీయ పార్టీ స్థాపనలో భాగంగా రిజిస్ట్రేషన్ కోసం ఎన్నికల కమీషన్ కి దరఖాస్తుని సమర్పించారు. ఇదిలా ఉండగానే ఆయన ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరి అక్కడే తనువు చాలించడం కోట్లాది ప్రజానీకాన్ని తీవ్రంగా కలచివేసింది. నేడు గద్దర్ భౌతికంగా లేకున్ననూ ఆయన తన పాటల ద్వారా ప్రతినిత్యం పల్లవిస్తూనే ఉంటారు. 'బతుకే ఒక పోరాటం' అని నినదించి సమసమాజ స్థాపన కోసం అనునిత్యం ఉద్యమించిన గద్దర్ అశేష జనం గుండె చప్పుళ్లలో ప్రతిధ్వనిస్తూ 'సమసమాజ స్వాప్నిక వేగుచుక్క'గా తరతరాలు ప్రభవిస్తూనే ఉంటారు.

**-జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్, 9493319690.**

## పంటలకు సేంద్రియ ఎరువులు వాడాలి

**తరిగొప్పుల ఆగస్టు 16 (ప్రజామంటలు)**

రైతు సోదరులకు మనవి ప్రస్తుతం కొనసాగుతున్న వ్యవసాయ విధానం వల్ల రైతులు అధికంగా కృత్రిమ (రసాయన) ఎరువులు వినియోగం వలన, చీడపీడల నివారణకు రసాయన ఎరువులు వినియోగం వల్ల భూమి పోషక లోపాలు లోపించి సారవంతం కోల్పోతుంది మరియు భూమి మార్పు చెంది క్రమంగా పంట దిగుబడి తగ్గుతూ వస్తుంది. ప్రస్తుత విధానం ఇలాగే కొనసాగితే పంట పండక భూమి నిస్సారం అవుతుంది. మనుషులు ఆధునిక జీవనశైలి కారణంగా, తినే ఆహారం వల్ల గాని, చేసే పని వల్ల గాని (శారీరక సామర్థ్యం) తగ్గి చిన్న వయసులోనే రోగాల బారిన పడి తినలేక పని చేయలేక బతుకును బలవంతంగా నెట్టుకొస్తున్నారు. అందుకే రాబోవు రోజుల్లో మానవ మనుగడ కొనసాగాలంటే భూమిని కాపాడుకొని, మనిషి జీవన విధానం మార్చుకోకపోతే మనిషి జీవితం, కొన్ని పక్షులు అంతరించినట్లు మనిషి కూడా అంతరించక తప్పదు. ఇప్పటికైనా మనిషి మేల్కొని జాగ్రత్త పడితే భూమిని కాపాడి, మానవ మనుగడ కొనసాగే అవకాశం మన ముందు ఉన్నది. ఈ అవకాశం వినియోగించుకొని అధిక దిగుబడి సాధించాలన్న, వచ్చే ముప్పును అధిగమించాలంటే మనకు అందుబాటులో ఉన్న అన్ని రకాల పంటలకు ఆర్గానిక్ మందులు (సేంద్రియ ఎరువులు) వాడాలి. కాబట్టి రైతులు కానీ, తెలిసిన వారు కానీ వాటిని వాడించి మనుషులను కాపాడుకుందాం. భూమిని రక్షించుకుందాం.

## కోరుట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



**కోరుట్ల టౌన్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

కోరుట్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్ పర్సన్ అన్నం లావణ్య అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీ విద్యా సాగర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.... పట్టణ అభివృద్ధి కొరకు నిధులు కేటాయించామని పురపాలక శాఖ మంత్రి కే. తారక రామ రావు ను కోరగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి టియూఎఫ్ఐడివసి ద్వారా రూ" 10.00 కోట్లు కోరుట్ల మునిసిపాలిటీ కి కేటాయించారని అందుకు పులపాలక శాఖ మంత్రి కే. తారక రామ రావుకు కోరుట్ల మున్సిపల్ పాలక వర్గం పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపినారు. అట్టి టియూఎఫ్ఐడికసి నిధులు 10.00 కోట్ల రూపాయలతో అన్ని వార్డ్ లలో పలు అభివృద్ధి పనుల యొక్క ప్రతిపాదనలు శ్రీయుత జిల్లా కలెక్టర్, జగిత్యాల కు పంపుటకుసభ్యులు ఆమోదం తెలిపినారు. అలాగే రాబోవు గణేశ్ నిమజ్జనం కార్యక్రమానికి పలు ఏర్పాట్ల కొరకు రూ" 7.00 లక్షలు కేటాయించినారు. ఇట్టి సమావేశంల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు చైర్ పర్సన్ శ్రీమతి అన్నం లావణ్య, వైస్ చైర్మన్ గడ్డమీద పవన్ మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్, డిప్యూటీ ఈఈ అభినయ్, ఏఈ జే. లక్ష్మి టిపిఓ ఏ. ప్రవీణ్ ఆర్ఓ బి. తిరుపతి వార్డ్ కౌన్సిలర్స్, కో ఆప్షన్ – మెంబెర్స్ మరియు ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



**గొల్లపల్లి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

గొల్లపల్లి మండలంలోని వెనుగుమట్ల గ్రామానికి చెందిన పాదం శ్రీకాంత్ (తండ్రి: హనుమాండ్లు) వయసు 28 సం. ధర్మారంలో బ్యాటరీ చార్గింగ్ షాప్ నడుపుకుంటూ జీవిస్తాడు మంగళవారం రాత్రి పది గంటలకు తన షాపుకు పాత బ్యాటరీలు వచ్చాయంటూ ఇంట్లో నుండి బైక్ నెంబర్ టిఎస్ 21బి5162 పై ధర్మారం వెళ్తుండగా మార్గమధ్యం లో చందోలి గ్రామ శివారు మలుపు వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బైక్ పొలం లోకి వెళ్లిపోగా మృతుడు శ్రీకాంత్ ఎగిరి రోడ్డు పక్కకు పడిపోవటంతో అతని తలకు ముఖానికి బలమైన గాయాలు కావడం చేత మరణించాడు. ఇట్టి విషయమై తల్లి పాదం శంకరవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై ఏ. నరేష్ కుమార్ తెలిపారు.

## వికలాంగులకు చేయూత కృతిమ అవయవాల కొరకు పేర్లను నమోదు చేసుకోవాలి



**చొప్పదండి ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

చొప్పదండి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, వికలాంగుల సహాయ పథకం కింద దివ్యాంగులకు పరికరాల పంపిణీ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిలుక రవీందర్ ముఖ్యఅతిథి గా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించినారు. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి గౌరవ అధ్యక్షులు మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చేయూతకు, వారి అభివృద్ధికి సహాయపడే పరికరాలు, కృతిమ అవయవాలు ఇచ్చుటకు ప్రత్యేక కార్యక్రమాన్ని దీనిని మండలంలోని దివ్యాంగులు ఉపయోగించుకొని వారికి కావలసిన సహాయ పరికరాలు కృతిమ అవయవాల అవసరాల కొరకు నమోదు చేసుకోవాలని, తరువాత వారిని పరీక్షించి అవసరమగు సహాయ పరికరాలు పంపిణీ చేస్తారని ఇట్టి అవకాశాన్ని దివ్యాంగులు తప్పక ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ కస్తూరి, కార్యాలయ పర్యవేక్షకులు శ్రవణ్ కుమార్ రావు, భారత ప్రభుత్వ కృతిమ అవయవాల తయారీ సంస్థ, అధికారులు శ్వేత, శివకృష్ణ పాల్గొన్నారు.

# దేశ ప్రగతిలో వాజ్ పేయ్ ది చెరగని ముద్ర వాజ్ పేయి వర్ధంతి వేడుకల్లో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**హుజూరాబాద్ ఆగస్ట్ 16 (ప్రజామంటలు)**

భారతదేశ ప్రధానిగా మూడు పర్యాయాలు పనిచేసిన అటల్ బిహారీ వాజ్ పేయి తనపాలనలో దేశ పురోగతి, అభివృద్ధిపై చెరగని ముద్ర వేసి, దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషించారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. హుజురాబాద్ బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బిజెపి శ్రేణులు ముందుగా వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ... భారత దేశం ప్రగతి వైపు పరిగెత్తడానికి, అనేక రంగాలను అభివృద్ధి వైపు తీసుకు వెళ్లడానికి వాజ్ పేయి ఎంతో కృషి చేశారని కొనియాడారు. నిజమైన రాజనీతిజ్ఞుడు, ప్రజాకర్షణ గల వక్త, దార్శనికత కలిగిన నాయకుడు అటల్ బిహారీ వాజ్ పేయి అని తెలిపారు. దేశం కోసమే పుట్టిన మహానుభావులు ఎందరో ఉన్నారని, అటువంటి వారిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పే యి ని ప్రముఖంగా చెప్పుకోవచ్చన్నారు. దేశమే జీవితం అనుకుని, దేశ హితం కోసం ఆలోచన చేసిన గొప్ప రాజకీయ యోధుడు అటల్ బిహారీ వాజ్ పాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, కౌన్సిలర్ పైళ్ల వెంకటరెడ్డి, నల్ల సుమన్, నాయకులు తూముల శ్రీనివాస్, దేవేందర్ రావు, మోడెపు వినయ్, గంగిశెట్టి ప్రభాకర్, కొలిపాక శ్రీనివాస్, రావుల వేణు, సబ్బని రమేష్, శశిధర్, పోతుల సంజీవ్, యాళ్ళ సంజీవరెడ్డి, చైతన్య రెడ్డి, బొరగాల సారయ్య, వొడ్నాల విజయ్, భాస్కర్ యాదవ్, మొలుగూరి నాగరాజు, కేశవ్, రాజు, కొమ్ముల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిధులొచ్చాయ్.. నిర్మాణాలు ఊపందుకున్నాయ్

సంగారెడ్డి:గతేడాది సంగారెడ్డి జిల్లాకు వైద్య కళాశాల మంజూరయింది. ఇప్పటికే రెండంతస్తుల భవనం పూర్తి కావడంతో అందులో తాత్కాలికంగా ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాల ప్రధాన భవనంతోపాటు ప్రొఫెసర్లు, విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాలు, ఇతర నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఇటీవల నిధులు మంజూరు కావడంతో అడ్డంకులు తొలగిపోయాయి. సకాలంలో ఆయా భవనాలు పూర్తయితే వైద్య కళాశాల నిర్వహణతో పాటు.. ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందే అవకాశం ఉంటుంది. పేదలకు ఆర్థిక భారం తప్పనున్నది. రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాల భవన నిర్మాణాల కోసం ఇటీవల రూ.142 కోట్లు మంజూరు చేసింది. ప్రధాన భవనంతో పాటు ఇతర పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు రూ.18 కోట్లు వ్యయమైనట్లు సంబంధిత ఆర్అండ్బీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కళాశాల భవన నిర్మాణానికి రెండంతస్తుల స్లాబ్ వేశారు. విద్యార్థులు, స్టాఫ్‌కు భవనం పనులు, వసతి గృహాలతోపాటు చదువుకునేందుకు గదులు, కిచెన్, డైనింగ్ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. సంగారెడ్డి పట్టణం రాజంపేట పరిధి రామచంద్రారెడ్డి కాలనీలోని పోలీస్ ప్రభుత్వం నర్సింగ్ కళాశాల కోసం కేటాయించింది. ఆయా భవన నిర్మాణాలకు రూ.35 కోట్లు కేటాయించింది. ఇందుకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉంది. ఆయా పనుల పర్యవేక్షణ బాధ్యతను తెలంగాణ ప్రభుత్వ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ)కు ప్రభుత్వం



అప్పగించింది. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఈఈ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రి పరిధిలోని భవనాల నుంచి వెలువడే నీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్ ప్లాంటు కట్టనున్నారు. మురుగును శుద్ధి చేసి ఆసుపత్రి ఆవరణలోని చెట్లకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందించారు. ఆసుపత్రి ఆవరణలో రహదారులు విస్తరించనున్నారు. రూ.3 కోట్లతో నాలుగు వరుసలుగా మార్చనున్నారు. రహదారి మధ్యలో డివైడర్ నిర్మించి.. పూల చెట్లు నాటనున్నారు. ఫుట్‌పాత్‌లు నిర్మించనున్నారు. సంగారెడ్డిలో వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం అనువైన వాతావరణం ఉంది. వచ్చే వానాకాలం నాటికి కీలకమైన పనులన్నీ పూర్తి చేస్తాం. ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఆ దిశగా ముందుకు సాగుతున్నాం.

# ఏజెన్సీలో పంటలే పంటలు


ఉట్నూర్ : ఏజెన్సీలో నీటి ప్రాజెక్టులు తక్కువ. దీనికితోడు బీడు భూములు. సాగునీటి సౌకర్యం సరిగా లేక కేవలం వర్షాధార పంటలే సాగు చేస్తుండేవారు. దిగుబడులు కూడా అంతంతమాత్రంగానే వస్తుండడంతో రైతులు కూడా నష్టపోయిన సందర్భాలు ఉండేవి. అయితే తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం పండుగలా సాగుతున్నది. గత యాసంగిలో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో బావులు, చెరువుల్లోకి పుష్కలంగా నీళ్లు చేరాయి. దీనికితోడూ రైతులకు ఉచితంగా 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుండడంతో సాగు నీటికి ఇబ్బందిలేకుం డా అయ్యింది. దీంతో గతంలో కంటే ఈ యా సంగిలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. మండలంలోని దంతన్‌పెల్లి, కొత్తగూడెం, చింగూడ, క ల్లూర్‌గూడ, శ్యాంపూర్, నాగాపూర్, హస్నాపూర్, చాందూరి, పులిమడుగు, సాలేవాడ, ఉమ్రి, కుమ్మరితండా గ్రామాల్లో శనగ, గోధుమ, మక్కజొన్న, జొన్న , వీటితో పాటు ఆకుకూరలు, కూరగాయలు టమాట, వంకాయ, గోబీ తదితర పం టలు పండిస్తున్నారు. వానకాలంలో వేసిన సో యా, పత్తి పంటలు కాలం ముగియగానే వాటిని తొలగించి యాసంగి పంటలు సాగుచేశారు. యాసంగిలో కురిసిన వర్షాలతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో శ్యాంపూర్, పులిమడుగు, సా కెర, సాలెవాడ, నాగాపూర్, హస్నాపూర్, చాం దూరి, ఉట్నూర్, దంతన్‌పెల్లి తదితర గ్రామాల్లోని బావులు నిండుగా ఉండగా, బోర్లనుంచి పుష్కలంగా నీళ్లు వస్తున్నా యి. దీంతో సాగునీటికి ఇ బ్బంది లేకుండా అయ్యింది. అంతేగాకుండా చెరువుల కింద ఆరుతడి పంటలైన గోధుమ, మక్కజొన్న, జొన్న, శనగ పంటల విస్తీర్ణం పెరిగింది. వీటితో పాటు ఆకుకూరలు, కూరగాయలు కూడా పండిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వం నిరంతర విద్యుత్



సరఫరా చేస్తుండడంతో బోరుబావుల కింద పంటలతో పా టు మక్కజొన్న, జొ న్న, శనిగ, వేరు శనిగ, గోధుమ, కూ రగాయ లు, ఆకుకూరలు తదితర ఆ రుతడి పంటలను సాగు చేస్తున్నా రు. నిరంతర విద్యుత్ సరఫరాతో నాడు బీళ్లుగా ఉన్న భూములు ప్రస్తు తం పచ్చదనంతో కళకళలాడుతున్నా యని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాకు మూడెకరాల భూమి ఉంది. గతంలో కరెంట్ సమస్య తీవ్రంగా ఉండేది. దీంతో అంతంతమాత్రంగానే సాగు చేసేవాడిని. అయితే తెలంగాణ ప్రభుత్వం వచ్చినంకా 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆకుకూరలు, కూరగాయల పంటలు పండిస్తున్నాను. గతంలో వర్షాధార పత్తి, సోయా పంటలే పండేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంట్ కష్టా లు లేవు. దీంతో పాటు బోరు, బావుల్లో సరిపడా నీరు ఉంది. ఇప్పుడు రెండెకరాల్లో సోయాతో పాటు కూరగాయలు పండిస్తున్నాను. సీఎం సకాలంలో విత్తనాలు కొరత లేకుండా అందించడం ఆనందంగా ఉన్నాం.

# అభ్యంతరాలతో ఆగిన ఉపకేంద్రం నిర్మాణం

ఏటూరునాగారం:ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లిలో చేపట్టిన విద్యుత్తు ఉపకేంద్రం పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అనుమతులు లేవని అభ్యంతరం తెలపడంతో పునాది పనులను అర్థంతరంగా ఆపేశారు. బోరు కోసం తీసిన గుంతతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెప్పినా ససేమిరా అన్నారు. వాహనం సీజ్ చేస్తామంటూ బోరు సెట్టు యజమానిని హెచ్చరించారు. దీంతో కేసింగ్ పని పూర్తి చేయకుండానే నిలిపేసి వెనుదిరిగాడు. పిల్లర్ల ఏర్పాటు కోసం తవ్విన గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల తరబడి ఎదురవుతున్న సమస్యలు దృష్టిలో ఉంచుకుని చిన్నబోయినపల్లిలో విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేశారు. ఈ సబ్‌స్టేషన్‌తో పూర్తి అటవీ ప్రాంతంలోనే ఉన్న గ్రామాలకు త్రీ ఫేస్ విద్యుత్తు సరఫరా నిరంతరాయంగా అందించే అవకాశం ఉంటుంది. సుమారు 25 కిలో మీటర్ల పరిధిలో 15 గ్రామాల వరకు ఉన్నాయి. నిర్మాణం పూర్తైతే ఆయా గ్రామాలకు దీర్ఘకాలిక విద్యుత్తు సమస్య తీరేది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిన భూమి వివాదం కొలిక్కి రావడం లేదు. అటవీ, రెవెన్యూ శాఖ మధ్య సంవత్సరాల తరబడి ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. చిన్నబోయినపల్లి రెవెన్యూ శివారు 98 సర్వే నంబర్‌లో మొత్తం 828.18 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత వరకు అడవి విస్తరించి ఉండగా సుమారు 250 ఎకరాల మేర అడవులు లేకుండా ఉండేవి. 35 సంవత్సరాలుగా ఈ భూముల్లో వంద మందికి పైగా రైతులు పోడు భూములని చెప్పి ఆరుతడి పంటలు సాగు చేసేవారు. దశాబ్దకాలంగా రైతులను సాగు చేయనీయకుండా ఆ భూమి అటవీశాఖదేనంటూ అధికారులు అడ్డుకుంటున్నారు. ఈ విషయంలో



ధర్నాలు, నిరాహార దీక్షలు పెద్దఎత్తున కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా విద్యుత్తు ఉపకేంద్రం పనులను కూడా అడ్డుకున్నారు. పనులకు ఆటంకం కలిగించొద్దని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమవుతుందన్న తరుణంలో అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదు. విద్యుత్తు సబ్ స్టేషన్ పనులకు అడ్డు చెప్పొద్దు. ఈ విషయమై పునరాలోచించాలి. జిల్లా కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకోవాలి.



ఈరోజు కోరుట్ల నియోజకవర్గంలోని మెట్ పల్లి పట్టణం, మేట్ పల్లి మండలం శక్తి కేంద్ర ఇన్చార్జిలు, సహ ఇన్చార్జిలతో మెట్ పల్లి లోని స్థానిక వాసవి గార్డెన్స్ లో జరిగిన సమావేశంలో పాల్గొని శ్రీ అటల్ బీహార్ వాజ్ పాయ్ వర్ధంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించి అనంతరం 2 నిమిషాలు మౌనం పాటించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్. పాల్గొన్న మెట్ పల్లి మండలం, పట్టణ శక్తి కేంద్ర ఇన్చార్జిలు, సహ ఇన్చార్జిలు.

## జగిత్యాల జిల్లా కొండగట్టు హుండీ లెక్కింపు లో చేతివాటం...?



జగిత్యాల ఆగస్ట్ 16 (ప్రజా మంటలు) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 9న జరిగిన హుండీ లెక్కింపు లొ పాల్గొన్న ఫౌండర్ ట్రస్టీ మారుతిపై అనుమానం వ్యక్తం చేస్తూ డైరెక్టర్ జున్ను సురేందర్, స్థానిక సర్పంచ్ తిరుపతి రెడ్డితొ కలిసి ఈవో వెంకటేష్ కు పిర్యాదు చేశారు. హుండీ లెక్కింపు సమయంలొ ఫౌండర్‌ట్రస్టీ వెండి, బంగారం వస్తువులు చేతిలోకి తీసుకోని, బయటకు వెళ్లినట్లు అనుమానం ఉన్నట్లు, అయితే సీసీ పుటేజ్ పరిశీలించి, విచారణ జరిపించాలని పిర్యాదులో ఇ.ఓను కోరారు.

## జిల్లా సైన్స్ అధికారికి సన్మానం



కోరుట్ల టౌన్ ఆగస్ట్ 16 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం విజయ వంతం చేయడానికి తీవ్రంగా కృషి చేసిన జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ ను తపస్ కోరుట్ల మండల శాఖ ఆధ్వర్యంలో కోరుట్ల మండల విద్యాధికారి గంగుల నరేశం చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. బాజోజి శ్రీనివాస్ సేవలకు గాను స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతిలో మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు గాడి పెల్లి అంజయ్య, దాసరి రమేష్ లు మరియు అంద శివప్రసాద్ధుం, బర్తి శంకరయ్య,కృష్ణమోహన్, పిస్క రమేష్, శ్రీమన్నారాయణ, తిరుకోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## జగిత్యాల జిల్లా బిఎస్పీ మైనారిటీ కన్వీనర్ గా మొహమ్మద్ ముజహిద్



కోరుట్ల టౌన్ ఆగస్ట్ 16 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్ర బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. మహ్మద్ ముజాహిద్ ని జగిత్యాల జిల్లా కన్వీనర్ గా చారు. మహ్మద్ ముజాహిద్ మాట్లాడుతూ నాకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు జగిత్యాల జిల్లాలో రాబోయే రోజుల్లో ఇంకా బహుజన్ సమాజ్ పార్టీని బలోపేతం చేసి, జగిత్యాల జిల్లాలో కోరుట్ల. ధర్మపురి. జగిత్యాల నియోజకవర్గాల లో భారీ మెజార్టీతో అన్ని సీట్లు బహుజన సమాజ్ పార్టీయే గెలవడానికి కృషి చేస్తానని అన్నారు. బీఎస్పీ నాయకులు. మైనారిటీలు. కార్యకర్తలు. మహమ్మద్ ముజాహిద్ కు శుభాకాంక్షలు తెలిపారు.




77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శాతవాహన హై స్కూలు జగిత్యాల విద్యార్థులు నిర్వహించిన వివిధ కార్యక్రమాలు ఆహుతలను ఆకట్టుకొన్నాయి.

## దివ్యాంగులకు పరికరాల పంపిణీ నమోదు



చొప్పదండి ఆగస్ట్ 16 (ప్రజా మంటలు): చొప్పదండి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, వికలాంగుల సహాయ పథకం కింద దివ్యాంగులకు పరికరాల పంపిణీ నమోదు కార్యక్రమానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిలుక రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యక్షులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చేయుతకు , వారి అభివృద్ధికి సహాయపడే పరికరాలు, కృతిమ అవయవాలు ఇచ్చుటకు ప్రత్యేక కార్యక్రమాన్ని దీనిని మండలంలోని దివ్యాంగులు ఉపయోగించుకొని వారికి కావలసిన సహాయ పరికరాలు కృతిమ అవయవాల అవసరాల కొరకు నమోదు చేసుకోవాలని, తరువాత వారిని పరీక్షించి అవసరమగు సహాయ పరికరాలు పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు తప్పక ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమానికి సిడిపిఓ కస్తూరి, కార్యాలయ పర్యవేక్షకులు శ్రవణ్ కుమార్ రావు, భారత ప్రభుత్వ కృతిమ అవయవాల తయారీ సంస్థ, అధికారులు శ్వేత, శివకృష్ణ మొదలగువారు పాల్గొన్నారు

# అమల్లోకి వచ్చిన వన్ నేషన్.. వన్ రేషన్



మిర్యాలగూడ : ఉపాధి, బతుకుదెరువు కోసం ప్రజలు దేశంలోని పలు రాష్ట్రాలకు వలస వెళ్తుంటారు. అలా వలస వెళ్లిన వారు రేషన్ బియ్యం తమ సొంత ప్రాంతంలోనే తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వారు బియ్యం తీసుకోలేక పోయేవారు. వారి కోటా బియ్యం సంబంధిత రేషన్ డీలర్ పక్క దారి పట్టించే అవకా శం సైతం ఉంది. అయితే వీటిని నివారించేందుకు కేంద్రం 'వన్ నేషన్..వన్ రేషన్' పథకాన్ని తీసుకొచ్చింది. మూడేళ్ల క్రితమే ఈ పథకాన్ని ప్రవేశ పెట్టినప్పటికీ.. సాంకేతిక కారణాలతో ఉమ్మడి జిల్లాలో జనవరిలో ప్రయోగాత్మకంగా.. ఫిబ్రవరి నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చింది. రాష్ట్ర పరిధిలో ఏ ప్రాంతంలో ఉన్న వారైనా వారు ఉన్న చోటే బియ్యం తీసుకునే సదుపాయం ఇప్పటికే అమల్లో ఉంది. పలు పనుల నిమిత్తం ఉమ్మడి జిల్లా నుంచి ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు వలస వెళ్తుండగా..బీహార్, ఉత్తరప్రదేశ్, జార?ండ్, పశ్చిమ బెంగాల్, ఏపీ తదితర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ పట్టణాలకు వలస వస్తుంటారు. భవన నిర్మాణం, మగ్గం పని, పరిశ్రమల్లో పని చేసే వలస కార్మికులు ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. అయితే వీరికి రేషన్ కార్డులు ఉన్నప్పటికీ బియ్యం తీసుకోలేక.. బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. వన్ నేషన్..వన్ రేషన్‌తో వలస వాదుల కష్టాలు తీరనున్నాయి. ఇతర రాష్ట్రాల వారు బియ్యం తీసుకోవాలంటే జాతీయ ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలి. రేషన్ దుకాణంలో ఈ- పోస్ యంత్రంలో వలస వాదుల ఆధార్ సంఖ్య నమోదు చేయగానే ఎన్ఎఫ్‌సీ కార్డు పూర్తి వివరాలు వస్తాయి. వివరాల ఆధారంగా డీలరు బియ్యం అందిస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మొత్తం 10,08,045 రేషన్ కార్డులు ఉండగా.. ఫిబ్రవరి నెలకు సంబంధించి 16,344.57 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. కార్డుల్లోని ఒక్కో యూనిట్‌కు కేంద్రం ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తుంది. వన్ నేషన్..వన్ రేషన్ పథకం కింద ప్రయోగాత్మకంగా నల్గొండ జిల్లాలో మొత్తం 20 మంది ఇతర రాష్ట్రాల కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. ప్రస్తుతం కేంద్రం ఈ ఏడాది డిసెంబరు వరకు బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుంది. వలస కార్మికుల సంక్షేమ కోసం ప్రవేశ పెట్టిన వన్ నేషన్.. వన్ రేషన్..పథకంలో ఇతర రాష్ట్రాలకు చెందిన ఎన్ఎఫ్‌సీ కార్డు కలిగి ఉన్న ప్రజలు జిల్లాలో ఏ రేషన్ దుకాణంలోనైనా బియ్యం తీసుకోవచ్చు. ఈ అవకాశాన్ని వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి. గత నెలలో జిల్లాలో 20 మంది ఇతర రాష్ట్రాల కార్డు దారులకు బియ్యం పంపిణీ చేశాం. ఈ నెలలో సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

# వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు ఎక్కువ : కలెక్టర్



మోత్కూరు, : ఇంటర్‌లో విద్యార్థులు వృత్తి విద్యాకోర్సులు అభ్యసించడం వల్ల వారికి ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని కలెక్టర్ పమేలాసత్పథి అన్నారు. మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వృత్తి విద్యాకోర్సు ల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఇంటర్‌లో కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ (సీజీటీ), ఎంపీహెచ్‌డబ్ల్యూ, అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్ తదితర వృత్తి విద్యాకోర్సుల ద్వారా ఉపాధి పొందుతూ ఉన్నత చదువులు చదువుకోవచ్చన్నారు. కళాశాలలోని సీజీటీ కోర్సు విద్యార్థినులు కుట్టిన దుస్తులను మోత్కూరు ఇందిరానగర్ (కొత్తగూడెం) అంగన్‌వాడీ కేంద్రంలోని 16 మంది చిన్నారులకు పంపిణీ చేశారు. కళాశాలకు ప్రహరీలేదని, బాలురకు మూత్రశాలలు లేవని, ఉపకార వేతనాలు అందడంలేదని, గ్రామాల నుంచి తాము కళాశాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు రావడం లేదని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కళాశాలకు నూతన ప్రిన్సిపాల్ వచ్చారని, సమస్యలను ఆమె పరిష్కరిస్తారని, బస్సుల విషయమై ఆర్టీసీకి లేఖ రాశామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఇంటర్ జిల్లా అధికారి రమణి, మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య, తహసీల్దార్ షేక్ అహమ్మద్, ప్రిన్సిపాల్ ప్రభా జస్టీస్, ప్రభాకర్‌రెడ్డి, ఎన్ఎసఎస ప్రోగ్రాం ఆఫీసర్ కడారు నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయించుకోవాలని కలెక్టర్ పమేలాసత్పథి సూచించారు. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం అంగన్‌వాడీకేంద్రంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. గర్భిణులు ఐరన్, పోలిక్‌యాసిడ్, క్యాల్షియం మాత్రలు తీసుకోవడంలో రాష్ట్రంలో జిల్లా 1 నుంచి 5 స్థానాల్లో ఉండగా, సాధారణ ప్రసవాల విషయంలో మాత్రం రెడ్ జోన్‌లో ఉందన్నారు. ఒక్కసారి సిజేరియన్ ఆపరేషన్ చేయించుకుంటే ఆయుష్షు ఐదేళ్లు తగ్గుందన్నారు. అనంతరం చిన్నారికి అన్నప్రాశన, గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, బీసీ సంక్షేమ జిల్లా అధికారి పి.యాదయ్య, సీడీపీవో జ్యోత్స్న, సూపర్‌వైజర్ మంగమ్మ, విజయ, సునీత తదితరులు పాల్గొన్నారు. బుజిలాపురంలో 'కంటి వెలుగు' శిబిరాన్ని కలెక్టర్ పమేలాసత్పథి ఆకస్మికంగా సందర్శించారు. ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు, ఎన్ని కళ్లద్దాలు ఇచ్చారు, పీహెచ్‌సీలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయనే అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్‌కుమార్‌ను ఆదేశించారు.

# ఆరుతడిపై ఆసక్తి చూపని రైతులు



జగిత్యాల : ఈ ఏడాది యాసంగి సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం కొంతమేర పెరిగింది. జిల్లాలో గత యేడాదితో పోలిస్తే రైతులు, వరి, మొక్కజొన్న, నువ్వు, శనగలను ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. మరో వైపు ఆరుతడి పంటల జోలికి పోలేదు. దీంతో ఆరు తడి సాగు విస్తీర్ణం పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం యాసంగి లో అన్నిరకాల పంటలు కలిపి సుమారు 2.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, 3.33 లక్షలకు పైగా ఎకరాల్లో రైతులు సాగు చేశారు. గత యేడాది యాసంగి సీజన్‌తో పోలి స్తే వేల ఎకరాల మేర పెరిగింది. వర్షాకాలంలో వానలు సమృద్ధిగా కురవ డంతో జలాశయాలు చెరువులు, కుంటలు నిండుకున్నాయి. భూగర్భ జలా లు సమృద్ధిగా ఉండడంతో బోర్లు, బావుల్లో ఆశించిన మేర నీరు ఉంది. దీంతో వరి, మొక్కజొన్న, నువ్వు పంటలు ఎక్కువగా సాగు చేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువల నుంచి పంటలకు సాగునీరు విడుదల కావడంతో పంటలు కళకళల్లాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గత యేడాది యాసంగి సీజన్‌లో 2,72,632 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి పం ట 2,08,207 ఎకరాలు సాగు అయింది. మొక్కజొన్న 14,153 ఎకరాలు, గో దుమ 279 ఎకరాలు, చెరుకు 1,997 ఎకరాలు, జొన్న 764 ఎకరాలు, మ స్టర్డ్ 1,091 ఎకరాలు, నువ్వులు 29,202 ఎకరాలు, నల్ల పప్పు 5,258 ఎక రాలు, మిగిలిన వివిధ రకాల పంటలు 11,681 ఎకరాల్లో సాగు అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత యేడాది యాసంగి సీజన్‌లో 3,33,320 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. ఇందులో ప్రధానంగా వరి పంట 2,94,482 ఎకరాలు సాగు అయింది. మొక్కజొన్న 27,550 ఎకరాలు, చెరుకు 561 ఎకరాలు, జొన్న 142 ఎకరాలు, మస్టర్డ్ 358 ఎకరాలు, నువ్వులు 7,982 ఎకరాలు, మిగిలిన వివిధ రకాల పంటలు 2,565 ఎకరాల్లో సాగు అవుతున్నాయి. జిల్లాలో వరి సాగు గణనీయంగా పెరిగింది. జిల్లాలో వరి, మొక్కజొన్న, నువ్వు పంటలకు డిమాండ్ ఉండడంతో మార్కెట్‌లో మంచి ధర వస్తోంది. దీంతో అత్యధికంగా ఇవే పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గత యేడాది యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది ఆరు తడి పంటల సాగుకు ఆసక్తి కనపర్చడం లేదు. తద్వారా ఆ రు తడి పంటల సాగు విస్తీర్ణం గణ నీయంగా తగ్గింది. జొన్నలు, పప్పుది నుసులు, పొద్దు తిరుగుడు, వేరుశనగ తదితర పంటల సాగు క్షీణించా యి. మార్కెట్‌లో ఆరుతడి పంటల ధరలు నిలకడగా లేకపోవడంతో పా టు ప్రభుత్వం మద్దతు ధర కల్పించక పోవడం కూడా పంటలు సాగు చేయకపోవడానికి కారణమని అంటున్నారు. అలవాటుగా సులభంగా చే తికొచ్చే వరి, మొక్క పంటలను సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో వరి పంట గత యేడాదితో పోలిస్తే ఎక్కువ సాగైంది.

# పశువుల్లో వ్యాధి నివారణే లక్ష్యంగా చర్యలు



మంచిర్యాల : బ్రూసెల్లోసిస్ వ్యాధిని అరికట్టేందుకు పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఆయా మండలాల్లోని పశు సంపదను దృష్టిలో ఉంచుకొని క్యాంపులు నిర్వహిస్తున్నారు. బ్రూసెల్లోసిస్ అనేది బ్రూసిల్లా బ్యాక్టీరియా వల్ల ఏర్పడిన ఒక రకమైన అంటువ్యాధి. ఇది జంతువులకే కాకుండా మానవులపైనా ప్రభావం చూపుతుంది. ఈ బ్యాక్టీరియా కలుషిత ఆహారం, గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. పచ్చిమాంసం, శుద్ధి చేయని పాలలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. బ్రూసెల్లోసిస్ వ్యాధికారక సూక్ష్మజీవితో కలుషితమైన మేత మేయడం, నీరు తాగడం, వ్యాధిగ్రస్తమైన కోడెలు, దున్నలు ఆరోగ్యకరమైన ఆవులు, గేదెలను దాటినప్పుడు వీర్యం ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో ఐదో నెలలోనే గర్భం పోవడంతో పాటు గర్భాశయ సంబంధిత వ్యాధులు, జ్వరం రావడం, కీళ్లనొప్పులు, వృషణాల వాపు, మగ పశువుల్లో వంధత్వం కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. బ్రూసెల్లోసిస్ సూక్ష్మజీవులు మనిషికంటి పొరల ద్వారా లేదా వ్యాధి సోకిన పశువుల పాలు, వెన్న, మాంసం తినడం వల్ల వ్యాప్తి చెందుతుంది. పురుషులకు ఈ వ్యాధి సోకితే వృషణాలు వాపు వచ్చి వీర్యం సక్రమంగా విడుదల కాక సంతానోత్పత్తి జరుగదు. మహిళలకు అబార్షన్ జరుగుతుంది. పిల్లలు పుట్టే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతాయి. జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్ర మం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసు న్న పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధికి టీ కాలతో పాటు గాలికుంటు వ్యాధి టీకాలు కూ డా వేయనున్నారు. జిల్లాలో 1,79,757 ఆవు లు, ఎద్దులు, లేగలుండగా, 1,05,798 బర్రె లు, దున్నలు, దూడలున్నట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. అలాగే 5,20,731 మేకలు, 1,83,526 గొర్రెలతో పాటు 2259 పందులున్నాయి. ఆయా మండలాల్లోని పశు సంపద ఆధారంగా క్యాంపులునిర్వహి స్తున్నారు. వ్యాధుల విషయంలో పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి. పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచాలి. వ్యాధిగ్రస్త పశువును మంద నుంచి వేరు చేయాలి. బ్రుసెల్లోసిస్ అంటు వ్యాధి. ఇది పాడి పశువులు, జీవాలు, మేకలు, పందులతో పాటు మనుషులకు వచ్చే ప్రమాదం ఉంది. వ్యాక్సిన్ పశువులకు వేసే సమయంలోనూ రక్షణ పరికరాలు వినియోగించాలి. లేని పక్షంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ఈ వ్యాక్సిన్ చుక్కలు మనిషి శరీరంపై పడితే బోద మాదిరిగా వాపులు వస్తాయి. సరైన సమయంలో టీకాలు వేయించడం వల్లే దీనిని నివారించవచ్చు. ఈ క్యాంపును పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

# బాల్యవివాహం.. భవితకు అడ్డంకి



సిరిసిల్ల : బాల్యవివాహాలు అమ్మాయిల భవితకు అడ్డంకిగా మారుతున్నాయి. అమ్మాయిలకు పెళ్లి వయస్సు రాక ముందే భారం దించుకునేందుకు కొంతమంది తల్లిదండ్రులు మూడుముళ్ల బంధం వేస్తున్నారు. లోకం పోకడ తెలియని వయసులో, ముక్కు పచ్చలారని పసితనంలో అమ్మాయిలకు పుస్తెల భారం పడుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అమ్మాయిలకు కొంతమంది తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేస్తున్నారు. మైనార్టీ తీరకముందే అధికారులకు తెలియకుండానే ఎన్నో వివాహాలు జరిగిపోతున్నాయి. గిరిజన తండాల్లో సంప్రదాయల పేరుతో గుట్టు చప్పుడు కాకుండా వివాహాలు జరుగుతున్న వైనం. జిల్లాలో ఐసీడీఎస్, షీటీమ్, బాలరక్షభవన్ ప్రతినిధులు బాల్య వివాహాలను అడ్డుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. గడిచిన సంవత్సర కాలంలో 13 బాల్య వివాహాలను అడ్డుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో వెయ్యి మంది బాలురకు 942 మంది బాలికలే ఉన్నారు. బాలికల నిష్పత్తి రోజు రోజుకు తగ్గిపోతుండడంతో వయస్సుతో నిమిత్తం లేకుండానే కొందరు అబ్బాయిలు వివాహాలకు ముం దుకొస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐసీడీఎస్, చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ అధికారులు నిరంతరం నిఘా పెట్టి బాల్య వివాహాలను అడ్డుకుంటున్నా ఆగడం లేదు. పేదరికంలో ఉన్న కొందరు భారం దించుకోవడానికి డబ్బున్న వారి సంబం?ధాలు చూసి వయస్సు ఎక్కువ ఉన్నవారికి ఇచ్చి బాల్య వివాహాలు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 16 ఏళ్ల అమ్మాయిని 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేయడానికి సిద్ధమైన సందర్భాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో గడిచిన ఐదేళ్లలో 51 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. 2017లో రెండు, 2018లో ఏడు వివాహాలను అడ్డుకుంటే 2019లో 11, 2020లో 11, 2021లో 7, 2022లో 13 వివాహాలను అడ్డుకున్నారు. జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ, తంగళ్లపల్లి, చందుర్తి, వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట తదితర మండలాల్లో కౌన్సెలింగ్ ద్వారా వివాహాలను వాయిదా వేసిన సంఘటనలు ఉన్నాయి. జిల్లాలో బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి, బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

# అరవై దాటినా ఆర్థిక భరోసా



సారంగాపూర్, : వృద్ధ మహిళలకూ ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాల్లో 18 నుంచి 60 ఏళ్లలోపు మహిళలకు మాత్రమే అవకాశం ఉండేది. 60 ఏళ్లు నిండిన వారిని గ్రూపుల నుంచి తొలగించేవారు. కాగా, వారిని కూడా ఇకపై కొనసాగించేలా నిర్ణయం తీసుకుంది. 60 ఏళ్లు నిండిన మహిళల వివరాలు సేకరించాలని జిల్లా సెర్ప్ అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో సెర్ప్ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ సర్వే చేస్తున్నారు. నేషనల్ రూరల్ లైవ్‌లీ మిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం గ్రూపులో కనీసం 10 మంది సభ్యులు ఉండాలి. అందుబాటులో ఉన్న బ్యాంక్ ఖాతా తెరవాలి. సంఘంలో చేరిన మహిళలు రెగ్యులర్‌గా సమావేశం నిర్వహించుకోవాల్సి ఉంటుంది. 1990 నుంచి పేద మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేశారు. 10 నుంచి 15 మందితో కూడిన సంఘాలు ఏర్పాటు చేసి వారితో బ్యాంకుల్లో పొదుపు చేయిస్తున్నారు. బ్యాంకుల ద్వారా రూ. లక్ష నుంచి రూ. 12 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తూ మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. సాధారణంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరడానికి 18 ఏళ్ల పైబడిన వారు అర్హులు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు జిల్లా సమైక్య, 67 మండల సమైక్య, 1923 గ్రామ సమైక్య, 41,046 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయి. ఇందులో 4,40, 246 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉండి 60 ఏళ్లు నిండిన తరువాత తొలగించిన మహిళల వివరాలు సెర్ప్ నుంచి డీఆర్డీవోకు అందాయి. మరోవైపు గ్రామాల్లో కూగా సమావేశాలు ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నారు. ఆ తర్వాత సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. పొదుపు సంఘాల్లో 60 ఏళ్లు పైబడిన వారికి సంబంధించి తుది గైడ్‌లైన్స్ రావాల్సి ఉంది. ప్రస్తుత సంఘంలో ఉన్న సభ్యులకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నారు. ఆయా డబ్బులతో అనేక మంది సొంతంగా కిరాణా దుకాణాలు, ఫ్యాన్సీ, టైలరింగ్, ప్లేట్ల తయారీ, జిరాక్స్ సెంటర్, కూరగాయలు, మెడికల్ దుకాణాలు, గొర్రెలు, మేకలు, పాడిపశువులు, బ్యాంగిల్ స్టోర్స్, ఆలు చిప్స్, మెకానిక్ దుకాణాలు, పచ్చడిల తయారీ, చిరువ్యాపారాలు, హోటల్స్, వర్మి కంపోస్టు తదితర వ్యాపారాలు చేస్తున్నారు. 60 ఏండ్ల పైబడిన వారు వారికి తోచిన వ్యాపారం చేసుకునే వీలు కలుగుతుంది. మలి వయస్సులో ఆర్థిక భరోసాకు ప్రభుత్వ నిర్ణయం దోహద పడుతుంది. 60 ఏండ్ల పైబడిన వారికి ఇది మంచి అవకాశం. గతంలో ఉన్నా కొన్ని కారణాలతో అధికారులు తొలగించిన్రు.

# సర్పంచుల ఆవేదన పట్టించుకోరా?



వీర్నపల్లి, ఫిబ్రవరి 10: అప్పులు తెచ్చి, బంగారు నగలను తాకట్టుపెట్టి అభివృద్ధి పనులు చేస్తే సర్పంచుల ఆవేదనను పట్టించుకోరా? అని మండల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీపీ మాలోతు భూల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముందు వైస్ ఎంపీపీ ఈసంపల్లి హేమ భర్త దేవేందర్ చిత్రపటం వద్ద నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎన్ని సర్వసభ్య సమావేశాలు నిర్వహించిన కాగితాలు మారుతున్నాయే తప్ప సమస్యలు పరిష్కారం కావడంలేదని శాంతినగర్ సర్పంచ్ కముటం మల్లేశం మండిపడ్డారు. సమస్యలను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేడనప్పుడు సభలో పాల్గొనడం ఎందుకని సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం అడవిపదిర సర్పంచ్ ఎడ్ల సాగర్, వీర్నపల్లి సర్పంచ్ దినకర్ అభివృద్ధి చేసిన పనుల బిల్లులను ఇంకెన్నడు మంజూరు చేస్తారని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు బిల్లులు రాక పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఏడాదికిపైగా చేసిన పనుల బిల్లులు నిలిచిపోయాయని, అధికారుల ఒత్తిడి మేరకు అప్పులు చేసి పనులు పూర్తి చేస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని అన్నారు. అనంతరం ఎంపీటీసీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు సరైన విద్యుత్‌ను అందించాలన్నారు. మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలను అందుబాటులోకి తేకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. మండలంలోని సర్పంచులకు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను మంజూరు చేసేలా ప్రత్యేక కృషి చేస్తామని ఎంపీపీ మాలోతు భూల అన్నారు. సర్పంచ్‌లు ఆందోళన చెందవద్దని, మంత్రి కేటీఆర్ సహకారంతో మండలం అభివృద్ధి దిశలో ముందుందని అన్నారు

# అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు



కరీంనగర్ : అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాగు కోసం కేటాయించిన భూములను ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు ఉన్నా అవేమీ పట్టనట్లు నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం, అధికారుల చేతివాటంతో కోట్లాది రూపాయల అసైన్డ్ భూమి కబ్జాకు గురవుతోందనే విమర్శలు వస్తున్నాయి. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ శివారులోని కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిని ఆనుకుని పెద్ద సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కమాన్‌పూర్ శివారులోని సర్వేనెంబర్లు 116, 117, 120 123, 124లో ప్రభుత్వ భూమిఉంది. ఈ సర్వే నెంబర్లలో ఎటువంటి అనుమతులు లేకున్నా నిర్మాణాలు చేస్తున్నారు. కమాన్‌పూర్ శివారులోని అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన ప్రజలు ఎన్నిసార్లు దరఖాస్తులు ఇచ్చినా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. కమాన్‌పూర్ శివారులోని సర్వేనెంబర్ 116లో ఉన్న అసైన్డ్ భూమిలో పెద్ద సంఖ్యలో నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. 2006సంవత్సరంలో అప్పటి ప్రభుత్వాలు జారీ చేసిన జీవోల ఆధారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమాన్‌పూర్ శివారులోని కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్నతూంకుంటకు తూట్లు పడుతున్నాయి. 120సర్వేనెంబర్‌లో ఉన్నతూంకుంటలో అక్రమ నిర్మాణాల జోరు సాగుతోంది. కళ్లెదుటే నిర్మాణాలు యథేచ్ఛగా సాగిస్తున్నా అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

# పట్టు రైతుల పొరుగుబాట



కుప్పం:జిల్లాలో రైతులు ప్రతినెలా వేలాది టన్నుల పట్టు ఉత్పత్తి చేస్తున్నారు. పట్టు గూళ్ల విక్రయాలకు ప్రభుత్వం తరఫున కుప్పం, పలమనేరు, మదనపల్లెలో మార్కెట్లున్నా కొనుగోళ్లు నామమాత్రమే. రీలర్లు ముందుకు రాకపోవడంతో ఆశించిన మేరకు కొనుగోళ్లు జరగడం లేదని అధికారులు అంటున్నారు. ఆయా మార్కెట్‌లకు తీసుకెళ్లిన రైతులు.. చాలా సందర్భాల్లో కొనుగోళ్లు లేక.. వెటనుదిరిగి కర్ణాటక బాట పట్టిన సందర్భాలు లేకపోలేదు. కుప్పం, పలమనేరు, పుంగనూరు, మదనపల్లె ప్రాంతాల్లో పట్టు సాగును చేపడుతున్న రైతుల్లో దాదాపు 80 శాతం కర్ణాటక మార్కెట్‌లను ఆశ్రయిస్తున్నారు. కుప్పం, పలమనేరు పరిసర ప్రాంతాల రైతులు.. వంద కి.మీ. దూరంలోని కోలార్, 140 కి.మీ. దూరంలోని శిల్లగట్ట, 250 కి.మీ. దూరంలోని రామనగర మార్కెట్‌లలో పట్టు గూళ్లను తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన పట్టు పురుగుల చాకీ కేంద్రాలు నిర్వహణ భారంతో దాదాపు దశాబ్దం కిందటే మూతపడ్డాయి. కొన్నింటిని ప్రైవేటుకు అప్పగించినా కొన్నాళ్లకే మంగళం పలికారు. జిల్లా రైతులు చాకీ కట్టిన పట్టు పురుగుల కోసం స్థానికంగా ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించినా అరకొరగా పురుగులు లభిస్తున్నాయని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో చాకీ పురుగుల నాణ్యత లేకపోవడం పట్టు దిగుబడిపై ప్రభావం చూపుతోందని అంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో కర్ణాటకలోని మైసూరు, తమిళనాడులోని కోయంబత్తూరు చాకీ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో పట్టు రైతులకు అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రభుత్వం ద్వారా అందేవి. ప్రస్తుతం ఆ ఊసే లేకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. బైవోల్టిన్ పట్టు గూళ్లు కిలోకు రూ.50 వంతున సర్కారు ప్రోత్సాహం నాలుగేళ్లుగా అందడం లేదు. వీ-1 మల్బరీ సాగుకు రాష్ట్ర ప్రభుత్వ రాయితీ ఇవ్వడం లేదు. పట్టుసాగు షెడ్ల శుభ్రత కిట్లు అందడం లేదు. ఆధునిక షెడ్ల నిర్మాణం రాయితీ కూడా ఆగిందని రైతులు వాపోతున్నారు. శాంతిపురం మండలం తుమ్మిశి కొత్తూరుకు చెందిన రైతు శ్రీనాథ్ పట్టు సాగులో అవసరాల కోసం పొరుగున తమిళనాడు, కర్ణాటకను ఆశ్రయిస్తున్నారు. ప్రతినెలా తమిళనాడులోని కోయంబత్తూరు సమీప అగరం ప్రాంతానికి వెళ్లి చాకీ పురుగులు కొనుగోలు చేస్తున్నారు. దాదాపు 800 కి.మీ. రాకపోకల వల్ల వ్యయప్రయాసలు తప్పడం లేదు. కర్ణాటకలోని మైసూరు కిరణ్‌గిరి, జగదీష్ చాకీ కేంద్రాల నుంచి పురుగులు కొనుగోలు చేయాలన్నా.. 600 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సిందే. ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రతిపాదనలను పంపాం. ప్రతి రైతుకూ పట్టు సాగు షెడ్డు శుభ్రత కోసం ఏడాదికి రూ.3,750 ప్రభుత్వం ఇచ్చే విధంగా నివేదికలను అందజేశాం. బైవోల్టిన్ పట్టుకు రూ.50 ప్రోత్సాహకం కోసం ప్రతినెలా లబ్ధిదారుల వివరాలు పంపుతున్నాం.

# జీతాల్లేవు.. ఆవేదనే మిగిలింది..!

## - పదో తేదీ వచ్చినా ఉపాధ్యాయులకు అందని వేతనాలు- రుణ వాయిదాల తేదీలు మార్చాలని బ్యాంకులకు వినతులు - నిరసన దీక్షలకు ఏపీటీఎఫ్ పిలుపు




అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులు జీతం ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితిలో ఉన్నారు. పదో తేదీ వచ్చినా ఇప్పటికీ చాలామందికి జీతాలు రాలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పట్లేదు. జీతం చేతికి అందిందంటే.. అదో పెద్ద పండగలా తయారైంది. ఏ ఉద్యోగికైనా ప్రతినెలా రుణవాయిదాలు, ఇతర ఖర్చులు ఉంటాయి. వీటికి నిర్దిష్ట తేదీ పెట్టుకుంటారు. ప్రభుత్వం ఎప్పుడు జీతం ఇస్తుందో తెలియని పరిస్థితుల్లో ఇలాంటివారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ రుణవాయిదా తేదీ మార్చాలని వైయస్ఆర్ జిల్లా జమ్మలమడుగులో బ్యాంకు మేనేజర్‌కు ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎవరికైనా జీతం వస్తే సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు. దీనికి గ్రూపుసభ్యులు 'మీరు అదృష్టవంతులు' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు. అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయుడు గృహ, వ్యక్తిగత రుణ వాయిదాలను ప్రతినెలా రూ.50వేల వరకు చెల్లించాల్సి ఉండగా.. జీతం రాకపోవడంతో గత నెల పొదుపు చేసిన రూ.30వేలతో పాటు రూ.20వేలకు చెక్కు ఇవ్వగా అది బౌన్స్ అయింది. ఇప్పుడు ఆయన జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలామంది పరిస్థితి ఇలాగే ఉంది. పిల్లల ఫీజులు, పాలవాడికి, కుటుంబ అవసరాలకు అప్పులు చేస్తున్నారు. కొందరు ఈఎంఐలు చెల్లించేందుకు బయట వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. ప్రభుత్వోద్యోగి ముఖంలో చిరునవ్వు కనిపిస్తేనే రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తారని, ఉద్యోగులకు రావాల్సినవన్నీ సరైన సమయానికి వచ్చేలా చేస్తానని ప్రతిపక్ష నేతగా జగన్ అనేక సభల్లో హామీలు ఇచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అసలు జీతమే సమయానికి రావట్లేదని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి జాతీయ సగటు కంటే మెరుగ్గా ఉందని సీఎం జగన్ ప్రకటించినా జీతాలు చెల్లించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని రాష్ట్ర ఉపాధ్యాయ సమాఖ్య-257 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజుల, భానుమూర్తి ప్రశ్నించారు. జీతాలివ్వకపోవడానికి కారణమేంటో చెప్పాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ డిమాండు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటే ఉపాధ్యాయులకు జీతాలు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం ప్రశ్నించారు. వెంటనే జీతాలు చెల్లించాలని స్కూల్ అసిస్టెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి డిమాండు చేశారు. జనవరి నెల జీతం కోసం జిల్లా, పాత తాలూకా కేంద్రాల్లో శనివారం నుంచి నిరసన దీక్షలు చేపడుతున్నాం. జీతాలు రాకపోవడంతో వైద్యం, పిల్లల ఫీజులు, బ్యాంకు రుణాల చెల్లింపులకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా జాప్యం జరుగుతుండడంతో ఉపాధ్యాయులు అపహాస్యానికి, అగౌరవానికి గురవుతున్నారు. చలో విజయవాడ తర్వాత ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యలు ఎక్కువయ్యాయి. ప్రతినెలా ఉపాధ్యాయులకు జీతాలు ఆలస్యంగా వేయడం వెనుక ఆంతర్యం ఏంటి? ఆలస్యంగా జీతాలు వేయడం వల్ల ఆర్థికంగా దెబ్బతిని, ఉపాధ్యాయులు కుంగిపోతారని ప్రభుత్వ భావిస్తున్నట్లు ఉంది.

# రవాణా బండి.. నడిచేదెలాగండి!



రాజమహేంద్రవరం:రవాణా వాహనాలపై అదనపు పన్నుభారం పడనుంది. త్రైమాసిక పన్ను 25 నుంచి 30 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవడంపై వాహన యాజమానుల్లో ఆందోళన నెలకొంది. కొవిడ్ కారణంగా ఇప్పటికే రవాణా రంగం కుదేలైంది. చమురు ధరలు, హరితపన్ను, ఫిట్‌సెస్ ఛార్జీలతో భారంగా సాగుతున్న రవాణా రంగంపై ఇప్పుడు త్రైమాసిక పన్ను పెంచడం సరికాదని రవాణా వాహన యాజమాన్య సంఘాల నాయకులు అంటున్నారు. ఆరు టైర్ల లారీకి ప్రస్తుతం చెల్లిస్తున్న త్రైమాసిక పన్నుకు అదనంగా మరో 26.14 శాతం, పది టైర్ల లారీకి 27.5 శాతం, 12, 14 టైర్ల లారీలకు 28 శాతం వరకు పెంచేందుకు, కాంట్రాక్టు క్యారియర్ బస్సులపై సీటుకు రూ.250 వరకు పెంచేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రాథమిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అమలులోకి వస్తే జిల్లాలో ఇటు సరకు రవాణా, అటు ప్రజారవాణా వాహనాలపై ఏటా సుమారు రూ.20 కోట్ల వరకు అదనపు భారం పడుతుందని రవాణా వాహన యాజమాన్య సంఘాల నాయకులు చెబుతున్నారు. జిల్లా పరిధిలో అన్ని రకాల వాహనాలు కలిపి 4.58 లక్షలు ఉండగా వీటిలో సరకు, ప్రయాణికుల రవాణా వాహనాలు 59,023 ఉన్నట్లు రవాణా అధికారులు చెబుతున్నారు. గతంలో అన్ని వాహనాలకు హరిత పన్ను రూ.200 ఉండేది. గతేడాది ప్రభుత్వం దీనిని భారీగా పెంచేసింది. సామర్థ్యం, వాహన కాలపరిమితికి అనుగుణంగా వివిధ రవాణా వాహనాలకు కనిష్ఠంగా రూ.వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ.20 వేల వరకు పెంచేయడం, ఫిట్‌సెస్ ఛార్జీలు కూడా గతంలో కంటే పెంచడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా లారీల నిర్వహణ మరింత భారంగా మారిందంటూ వాటి యజమానులు గగ్గోలు పెడుతున్నారు. నెలలో రెండు, మూడు కిరాయిలు దొరకడమే కష్టమవుతున్న తరుణంలో పెరిగిన వాహన పన్నులు చెల్లించడానికి సతమతమవుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కో వాహనానికి ఏటా వివిధ పన్నులు, పర్మిట్ల రుసుముల రూపేణా రూ.లక్షకు పైగానే ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోందని, వీటితోపాటు బీమా, వాహన మరమ్మతులకు మరో రూ.1.50 లక్షల వరకు అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైవర్, క్లీనర్ వేతనాలు, ఫైనాన్స్ వాయిదాలు చెల్లించే సరికి లారీ ఓనర్‌కు మిగిలేది ఏమీ లేకపోగా అప్పులు చేయాల్సి పరిస్థితి ఉందని చెబుతున్నారు.

# ఎస్సీ, ఎస్టీలపై అక్రమ కేసులు రద్దు చేస్తాం:లోకేశ్



పెనుమూరు,: శ్రీరంగరాజపురం మండలంలోని పుల్లూరు పంచాయతీ కాపుకండ్రిగలో లోకేశ్ దళితులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తిరుమలలో జరిగిన ఓ కార్యక్రమంలో అగ్రవర్ణాల వారు కుర్చీల్లో కూర్చుంటే ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చేతులు కట్టుకొని వెనుక వరుసలో నిల్చోవడం దారుణమన్నారు. నియోజకవర్గ పరిధి ఓ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి, దళిత మహిళ వైకాపా నేతల అవినీతిని ప్రశ్నిస్తే, ఆమె ఓ గదిలో దుస్తులు మార్చుకుంటుంటే రహస్యంగా సెల్‌లో చిత్రీకరించి వైకాపా నేతలు వేదింపులకు గురిచేసినట్లు ఆరోపించారు. ముఖాముఖిలో పలువురు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానమిచ్చారు. 'చంద్రబాబు సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ నిధులు ఏ శాఖకు మళ్లించం. పూర్తిగా వారికే కేటాయిస్తాం. ఎస్సీ, ఎస్టీలపై ప్రస్తుత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు తొలగిస్తాం. వారిపై దాడుల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. తెదేపా ప్రభుత్వ హయాంలో పక్కా ఇళ్ల బకాయిలన్నీ విడుదల చేస్తాం. పెండింగ్ బిల్లులు ఇవ్వలేని నారాయణస్వామి పదవికి రాజీనామా చేయాలి. అంబేద్కర్ విదేశీ విద్యా విధానాన్ని పక్కాగా అమలు చేస్తాం. ఎస్సీలు ఉన్నత చదువులు చదివేలా చేసి వారు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేసేలా కృషి చేస్తాం. భూమిలేని ప్రతి ఎస్సీకి భూ పంపిణీ చేస్తాం. ప్రభుత్వ భూమి లేకపోతే కొనుగోలు చేస్తాం.పేద ఎస్సీల గృహాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం' అని లోకేశ్ తెలిపారు.

# మారనున్న అంగన్‌వాడీల ముఖచిత్రం



కాకినాడ: ఐసీడీఎస్ ప్రాజెక్టులను పునర్వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాసనసభ నియోజకవర్గాల ప్రాతిపదికన తీసుకుని వాటి పరిధిలోని మున్సిపాలిటీలు, మండలాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను చేర్చారు. దీంతో అంగన్‌వాడీ ప్రాజెక్టుల ముఖచిత్రాలు మారనున్నాయి. సీడీపీవోలకు సంబంధించి ఇంకా స్పష్టత రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది పార్లమెంట్ స్థానాలను ఆధారంగా చేసుకుని జిల్లాలను ఏర్పాటుచేసింది. దీనిలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టులు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయా జిల్లాల్లో చేర్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 28 ప్రాజెక్టులు, 5,546 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండేవి. పునర్వ్యవస్థీకరణతో ఆ ప్రాజెక్టుల సంఖ్య 23, అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 5,268కి తగ్గింది. నూతన జిల్లాల ఏర్పాటుతో ఏ జిల్లాలకు ఆయా ప్రాజెక్టులను విభజించారు. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర జారీ చేసిన ఉత్తర్వులు జిల్లాకు చేరాయి.

# డ్రోన్లతో.. సస్యరక్షణకు సాంకేతికత



అమలాపురం:వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మరింత సమర్థంగా.. సులభంగా రసాయనాలు పిచికారీ చేయడానికి ప్రత్యేక డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో ఇతర వాణిజ్యపంటలకు మందులు పిచికారీ చేయడానికి అనుకూలంగా ఉండటంతోపాటు సమయం, వ్యయం ఆదా కావడంతో రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతు బృందాలకు రాయితీపై డ్రోన్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇవి కస్టమ్ హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ) బృందాలకు 40శాతం రాయితీపై అందిస్తారు. వీటి ధర సగటున రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉండవచ్చని అధికారులుఅంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఒక్కో మండలంలో మూడు రైతు బృందాలకు వీటిని ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలానికి మూడు ఆర్బీకేల పరిధిలో మూడు రైతు బృందాలకు 40 శాతం రాయితీతో ఇస్తారు. అయిదుగురు రైతుల బృందంలో ఒకరు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైఉండాలి. డీజీసీఏ నిబంధనల ప్రకారం డ్రోన్ ఆపరేట్ చేసే వ్యక్తికి కచ్చితంగా పాస్‌పోర్టు ఉండాలి. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం అర్హతలు నిర్ణయించింది. డ్రోన్ కొనుగోలుకు అయ్యే వ్యయాన్ని బ్యాంకు ద్వారా రుణం తీసుకోవాలి. రైతు వాటాతో కలిపి మొత్తం సొమ్ము చెల్లించిన తరువాత డ్రోన్ కొనుగోలు చేస్తారు. అనంతరం ప్రభుత్వం అందించే రాయితీ రైతుల బ్యాంకు ఖాతాకు జమవుతుంది. ఆర్బీకేల్లో ఎంపిక చేసిన బృందాల్లో ఒకరికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 12 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందిన రైతు తర్వాత అదే బృందంలో కొనసాగేలా బృందంలో మిగిలిన రైతులతో ఒప్పందం ఉంటుంది. మండలంలో ప్రతి రైతుకు ఈ డ్రోన్ సేవలందించేలా నిబంధనలు రూపొందించారు. అందరికీ అద్దె ప్రాతిపదికన అందుబాటులో ఉండేలా అధికారులు పర్యవేక్షిస్తారు. డ్రోన్ల ద్వారా పిచికారీ వేగంగా, సులభంగా పూర్తవుతుంది. ఎకరా విస్తీర్ణంలో పురుగు మందు పిచికారి చేయడానికి 8 నిమిషాల సమయం సరిపోతుంది. సాధారణ పిచికారీతో పోలిస్తే 30శాతం వరకు పురుగుమందు ఆదా అవుతుంది. నేలలో తేమ ఎక్కువగా ఉన్నా.. వాతావరణం ప్రతికూలంగా ఉన్నా, డ్రోన్లతో పిచికారీకి ఇబ్బందులు ఉండవు. సాధారణ స్ప్రేయర్లతో చల్లే క్రమంలో అన్ని మొక్కలపై సక్రమంగా పడకపోవడం, గాలికి కొంత నేలపైపడి వృథా కావడం జరుగుతాయి. డ్రోన్ల ద్వారా రసాయనాలు పంటలపై చల్లడం వల్ల మొక్కలపై పడటంతో వృథా కాకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పంటలపై కావాల్సిన ఎత్తునుంచి పిచికారీ చేసే వెసులుబాటు ఉంటుంది. ఏ పంటకు ఏ దశలో ఎంత మోతాదులో రసాయనండ్రోన్ల ద్వారా పిచికారీ చేయాలో నేర్పించనున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో ప్రైవేటు డ్రోన్లఆపరేటర్లు అద్దె విధానంలో సేవలందిస్తున్నారు. అధిక వర్షాలు పడి మనుషులు చేలల్లోకి వెళ్లలేని స్థితిలోకూడా డ్రోన్ల ద్వారా ఇప్పటివరకు చేలల్లో చీడపీడలకు తీవ్రత ఆధారంగా సాధారణ, ప్రమాదకర రసాయనాలు చేతిపంపులతో చల్లుతూవస్తున్నారు. ఆ క్రమంలో జాగ్రత్తలు తీసుకోకుండా రసాయనాలు పిచికారి చేయడంతో వాసన పడక అస్వస్థతకు గురికావడం, వాంతులు కావడం, కళ్లు తిరిగి పడిపోవడం వంటి ఇబ్బందులకు గురయ్యేవారు. డ్రోన్లు అందుబాటులోకి వస్తే ఆ పరిస్థితి ఉండదు. ఎంపికవ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాధాన్యం పెంచాలనే ఉద్దేశంతోనే డ్రోన్లను వినియోంగలోకి తీసుకువస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలానికి మూడు చొప్పున అందిస్తారు. వీటికి రైతు బృందాల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. ఆసక్తి ఉన్నవారు సంబంధిత మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలి. వీరికి 40శాతం రాయితీపై అందిస్తారు. బృందంలో అగ్రికల్చరల్ బీఎస్సీ చదివిన అభ్యర్థి ఉంటే ఆ బృందానికి 50 శాతం రాయితీ వస్తుంది.

# శిశు సంక్షేమంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

తాడిపత్రి:శిశుసంక్షేమ శాఖలో పనిచేసే ఉద్యోగులు ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తప్పవని ఐసీడీఎస్ రాష్ట్ర డైరెక్టర్ సిరి పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణంలోని జూటూరు కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందుతుందా లేదా, ప్రీస్కూల్ విద్యను నేర్పిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీవో సాజిదాబేగం, తహసీల్దార్ మునివేలు తదితర సిబ్బంది పాల్గొన్నారు. నాణ్యతలేని పౌష్టికాహారాన్ని అందిస్తే కఠిన చర్యలు తప్పవని సిరి హెచ్చరించారు. పెద్దపప్పూరు మండలంలోని వరదాయపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఈ నెల పాలు అందలేదని గుర్తించారు. నాణ్యతలేని పౌష్టికాహారాన్ని తిరిగి వెనక్కి పంపాలని స్థానిక ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. బరువు తక్కువతో పుట్టే పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను బాలింతలకు వివరించారు.

# కుప్పలపై 10,500 టన్నుల ధాన్యం



కాకినాడ: జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాల్లో వరి కుప్పలపై 10,500 టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. త్వరగా నూర్పులు చేయకపోతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు సేకరించే అవకాశం ఉండదని వారు చెబుతున్నారు. కోటనందూరు, తుని, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు మండలాల్లోని వరి కుప్పలను రైతు భరోసా కేంద్రాలతో ట్యాపింగ్ చేశారు. ఖరీఫ్ కోతల అనంతరం కుప్పలు వేసి, ఆ పొలాల్లో అపరాలు సాగు చేశారు. ఈ పంట చేతికొస్తేగానీ వరి కుప్పలు నూర్చే అవకాశం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. రోజూ 400 టన్నుల వరకే ధాన్యం సేకరణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను మూసివేసే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కుప్పలపై ఉన్న ధాన్యం నూర్పులు జరిగే వరకు వీటిని కొనసాగించాలని కాకినాడ జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు రాష్ట్రస్థాయి అధికారులకు లేఖ పంపారు. మార్చి ఆఖరు వరకు వీటిని కొనసాగించే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అనుమతి రాకపోతే కుప్పలపై ఉన్న ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా కనీస మద్దతు ధరకు సేకరించే వీలుండదు. ఇప్పటికే బహిరంగ మార్కెట్‌లో మిల్లర్లు ధాన్యాన్ని కొనడం లేదు. మార్చి తరువాత కుప్పలపై ఉన్న ధాన్యాన్ని నూర్పు చేసినా, కొనేవారు లేకపోతే రైతులకు ఇబ్బందులు తప్పవు. గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని త్వరగా నూర్పులు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. సీజన్ల వారీగా పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. దీని ప్రకారం ధాన్యం పోర్టల్ పనిచేస్తోంది. గతేడాది ఖరీఫ్‌లో పండిన ధాన్యాన్ని సీజన్ తరువాత రబీలో ఉత్పత్తయిన ధాన్యంతో ఆర్బీకేల ద్వారా కొన్నారు. వీటికి ఎఫ్‌టీవోలు జారీ చేశారు. సీజన్ మారిపోయిన నేపథ్యంలో వీటిని తప్పుడు ఎఫ్‌టీవోలుగా పరిగణించారు. అప్పట్లో ఈ విధంగా ధాన్యం అమ్మిన రైతులు కొందరు నష్టపోయారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా మేల్కొనాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఖరీఫ్ కొనుగోలు కేంద్రాలను మరిన్ని రోజులు నిర్వహిస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. లేకపోతే కుప్పలపై ఉన్న 10,500 టన్నుల ధాన్యం కొనుగోళ్లు అగమ్యగోచరంగా మారే ప్రమాదముంది. దీనిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసి, తమకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. ధాన్యం సొమ్ముల విడుదలలో మళ్లీ జాప్యం చోటుచేసుకుంటోంది. జనవరి ఆఖరు వరకు ధాన్యం సేకరించిన 21 రోజుల గడువు తరువాత రైతుల ఖాతాలకు సొమ్ములు జమ చేశారు. ప్రస్తుతం సొమ్ముల విడుదల మందగించాయి. గడువు ముగిసినా వీటిని చెల్లించడం లేదు. కాకినాడ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు నవంబరు 10 నుంచి ధాన్యం సేకరణ మొదలుపెట్టారు. మంగళవారం నాటికి 53,088 మంది రైతుల నుంచి 2,56,751 టన్నుల ధాన్యాన్ని 254 ఆర్బీకేల ద్వారా కొన్నారు. వీటికి రూ.523 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికి రూ.471 కోట్లు జమ చేశారు. ఇంకా రూ.52 కోట్లు రైతులకు ఇవ్వాలి. కొన్నిరోజులుగా చెల్లింపులు నిలిచిపోయాయి. ఖరీఫ్ సాగు చేసిన రైతులు పెట్టుబడికి డబ్బుల్లేక, ధాన్యం సొమ్ముల కోసం నిరీక్షిస్తున్నారు. వెంటనే చెల్లింపులు చేయాలని వేడుకుంటున్నారు. జిల్లాలో అన్ని ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఎవరి వద్దనైనా ధాన్యం ఉంటే వెంటనే సంబంధిత ఆర్బీకేలో సంప్రదించాలి. కుప్పలపై ఉన్న ధాన్యాన్నీ కొంటాం. త్వరగా నూర్పులు చేసుకుంటే ఇబ్బంది ఉండదు. కొనుగోలు కేంద్రాలను వచ్చే నెలాఖరు వరకు కొనసాగించాలని ప్రతిపాదించాం. అనుమతి కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికే కొన్న ధాన్యానికి త్వరగా సొమ్ములు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం గడువు దాటిన అన్ని ఖాతాలకు సొమ్ములు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం.

# పాకిస్తాన్‌లో ప్రజల బతుకు కష్టం.. ఇంకా వీడని ఆర్థిక సంక్షోభం..!



ఇస్లామాబాద్ : ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్తాన్‌లో నిత్యావసరాల ధరలు అమాంతం పెరగడంతో.. అక్కడి ప్రజలు బతకడం కష్టమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపడతున్నారు. ఆర్థికంగా దెబ్బతింటే ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందో యావత్ ప్రపంచానికి శ్రీలంక ఓ ఉదాహరణగా నిలిచింది. ఇటీవల కాలంలో రుణాలు తీసుకుంటూ శ్రీలంక కొంతమేర ఆర్థికంగా పుంజుకుంటున్నా.. ఇస్లాం దేశమైన పాకిస్తాన్ మాత్రం ఆ దేశం నుంచి ఇంకా గుణపాఠాలు నేర్చుకోకపోవడం శోచనీయం. పాకిస్తాన్ ఆర్థిక మాంద్యం నుంచి పుంజుకోవడానికి రుణాలను తీసుకున్నా.. వాటిని తిరిగి చెల్లించలేక అవస్థలు పడుతోంది. దాదాపు ప్రపంచంలోనే రుణ ఎగవేతకు దగ్గరలో ఉన్న అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో పాకిస్తాన్ ఐదో దేశంగా నిలవనుందని కొన్ని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ద్రవ్యోల్బణం 48 ఏళ్ల గరిష్టానికి చేరింది. దీంతో అక్కడి ప్రజల జీవనం కష్టతరమౌతుంది. ఇక గతేడాది వరదల ప్రభావం అక్కడి ప్రజల పైనా, ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికీ కొనసాగుతోంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు ఈ వారంలో పాక్ ప్రభుత్వం ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ నుండి 6.5 బిలియన్ డాలర్ల రుణం కోసం ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఏడాదిలో జరగబోయే నేషనల్ అసెంబ్లీ ఎన్నికలు గందరగోళంగా మారే అవకాశముందని మీడియా వర్గాలు పేర్కొన్నాయి. గతంలో ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ కానీ, ఇప్పుడున్న షెహబాజ్ షరీఫ్‌లు కానీ పాక్ అభివృద్ధి దిశగా ప్రయత్నాలు చేయకపోవడం ప్రజలు నిశితంగా గమనిస్తూనే ఉన్నారని ప్రముఖ మీడియా ఛానెల్ బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఆర్థికంగానూ, రాజకీయంగానే కాదు.. అక్కడ ఉగ్రవాదం కూడా పెచ్చరిల్లడం ఆ దేశాభివృద్ధికి పెను సమస్యగా దాపురించింది. ఇటీవల పెషావర్ నగరంలోని మసీదులో జరిగిన ఆత్మాహుతి దాడివల్ల దాదాపు 100 మందికిపైగా మృతి చెందారు. ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో అక్కడి ప్రజల పరిస్థితులు ఎలా ఉన్నాయని తెలుసుకోవడానికి బ్లూమబర్గ్ అనే న్యూస్ ఛానెల్ పాకిస్తానీయులను పలకరించింది. ఈ ఛానెల్‌తో మొహమ్మద్ రషీద్ అనే ఓ రెస్టారెంట్ యజమాని మాట్లాడుతూ... 'పెరుగుతున్న ధరల ద్రవ్యోల్బణం వల్ల స్థానిక వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి. ఈ శీతాకాలంలో తన రెస్టారెంట్‌లో సీ ఫుడ్స్ 50 శాతం మేర విక్రయాలు తగ్గాయి. ధరలు పెరగడం వల్ల మధ్యతరగతి కష్టమర్లు సీ ఫుడ్‌కి దూరంగా ఉంటున్నారు.' అని అన్నారు. ఇక గ్యాస్ స్టేషన్ మేనేజర్ ఇర్ఫాన్ అలీ బ్లూమ్‌బర్గ్ ఛానెల్‌తో మాట్లాడుతూ.. 'ప్రభుత్వం గత నెలలో పెట్రోల్ ధర పెంచింది. ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర 262గా ఉంది. దీంతో ప్రయాణీకులు.. తమ ప్రయాణలను తగ్గించుకుంటున్నారు. లీటర్ పెట్రోల్ ధర రూ. 200 ఉన్నప్పుడు 15 వేల లీటర్ల పెట్రోల్‌ని అమ్మాం. ఇప్పుడు రూ. 250కి పైగా ఉండడంతో రోజుకు 13 వేల లీటర్లే అమ్ముతున్నాము. ఒక్కోరోజు అంతకంటే తక్కువగా అమ్ముతున్నాము. ప్రస్తుతం పార్కో పాకిస్తాన్ లిమిటెడ్ పెట్రోల్ బంక్‌లు ఖాళీగా ఉంటున్నాయి' అని ఇర్ఫాన్ అలీ చెప్పుకొచ్చారు. చాలామంది పాకిస్తానీయులు రోజువారీ అవసరాల కోసం అప్పులు చేస్తున్నారు. ఫర్జానా అనే మహిళ తన ఇంటి అవసరాల కోసం ఐదు వేల రూపాయల్ని అప్పు చేయగా.. దాన్ని తీర్చలేక 16 ఏళ్ల తన కుమారుడిని చదువు మాన్పించి రెస్టారెంట్‌లో పనికి పంపిస్తున్నట్లు మీడియాతో చెప్పారు. తన దగ్గరున్న నగలన్నీ కూడా అమ్ముకున్నానని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఇక మహమ్మద్ రషీద్ అనే ఓ రైతు మీడియాతో మాట్లాడుతూ.. 'గత రెండేళ్లలో కూలీల రేట్లు బాగా పెరిగిపోయాయి. వ్యవసాయ ఖర్చులు భారీగా పెరిగాయి. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు' అని అన్నారు.

# చెత్త పన్ను వసూలుకు ఎత్తుగడ!

## - ఆస్తి పన్నుకు అనుసంధానానికి కసరత్తు




సత్తెనపల్లి,: ఆస్తిపన్ను డిమాండు నోటీసులోనే చెత్త పన్ను రుసుం విధించేలా పురపాలకశాఖ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉన్నతస్థాయి నుంచి అందిన మార్గదర్శకాలకు అనుగుణంగా వార్డు సచివాలయాల పరిధిలో నివాస గృహాలకు ఆస్తిపన్ను అసెస్‌మెంట్లకు అనుసంధానంచేసే ప్రక్రియ గత వారం రోజులుగా వేగవంతమైంది. ఈ అసెస్‌మెంట్లలో చెత్తపన్ను రుసుం విధించడం ద్వారా ఇకనుంచి ప్రజలు, వ్యాపారులు తప్పనిసరిగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడబోతోంది. నరసరావుపేట, చిలకలూరిపేట పట్టణాల్లో దీన్ని త్వరలోనే అమలు చేయనున్నారు. మిగిలిన పట్టణాలు, నగర పంచాయతీలకు ఆటోలు సరఫరా చేసిన తర్వాత క్రమంగా వర్తింపజేయనున్నారు. 2021 అక్టోబరు 1 నుంచి క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) అమల్లో భాగంగా ఇంటింటా చెత్త సేకరణ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 42 పట్టణాలకు ఆటోలు అందజేసి చెత్త సేకరణకు సంబంధించి వినియోగ రుసుం (యూజర్ ఛార్జిలు) వసూలు చేస్తున్నారు. జిల్లాలో నరసరావుపేట, చిలకలూరిపేట పట్టణాలకు ఆటోలు సరఫరా అయ్యాయి. ఒక్కో ఆటోకు రూ.52 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో పన్నులు వసూలు కాకపోవడంతో ఆటోలు, కార్మికుల సేవల్లో ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి. ఈక్రమంలో ఆ రెండు పట్టణాలతోపాటు మిగిలిన వాటికి కూడా ఆస్తిపన్ను డిమాండు నోటీసులోనే చెత్త సేకరణ పన్నును పొందుపర్చి నూరుశాతం వసూలుచేసే దిశగా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటి నుంచి నెలవారీగా వినియోగ రుసుము వసూలు చేస్తున్నారు. ఈ విధానంలో మార్పులుతెచ్చి క్లాప్ పీటీ మ్యాపింగ్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రాంతాల్నిబట్టి ప్రతి ఇంటికి రూ.30 నుంచి రూ.90 వరకు, వ్యాపార, వాణిజ్య దుకాణాలకు రూ.2 వేలు నుంచి రూ.5 వేలు వరకు పన్ను విధించనున్నారు. నరసరావుపేట పట్టణంలో 24 చెత్త సేకరణ ఆటోలు ఉంటే వాటికి నెలకు రూ.15.11 లక్షలు చెల్లించాల్సి ఉంది. చెత్త సేకరణ రుసుము డిమాండు రూ.17.18 లక్షలుగా ఉంది. గతేడాది మార్చి నుంచి వసూళ్లను చూస్తే ఏ నెలలోనూ వసూళ్లు 60 శాతానికి మించలేదు. జనవరిలో రూ.81,990 మాత్రమే వసూలైంది. చిలకలూరిపేట పట్టణానికి 27 ఆటోలు సమకూర్చగా వాటికి నెలకు రూ.17 లక్షలు చెల్లించాల్సి ఉంది. అదే చెత్త సేకరణకు సంబంధించి యూజర్ ఛార్జిల డిమాండు నెలకు రూ.19.82 లక్షలుగా నిర్దేశించారు. ఈ పట్టణంలో జనవరిలో రూ.34,410 మాత్రమే వసూలైంది. చెత్త సేకరణకు పన్ను చెల్లించేదేంటనే భావనలో ప్రజలు, వ్యాపారులు ఉండగా.. పురపాలకశాఖ కొత్త ఎత్తుగడ వేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,32,259 ఆస్తిపన్ను అసెస్‌మెంట్లతో గృహాలు, వాణిజ్య సముదాయాల వివరాల్ని క్లాప్ పీటీ యాప్‌లో అనుసంధానం చేస్తున్నారు. ఈ విధానం ద్వారా ఆస్తిపన్ను అసెస్‌మెంట్లకు తగ్గట్లుగా చెత్త సేకరణ వినియోగ రుసుం చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనేది ప్రభుత్వానికి సులభంగా తెలియబోతుంది. క్లాప్ యాప్‌లో పీటీ మ్యాపింగ్ ప్రక్రియ ఉన్నతాధికారుల మార్గదర్శకాలకు అనుగుణంగా చేపడుతున్నట్లు కమిషనర్లు తెలిపారు.

# అరకొర సిబ్బందితో సేవలెలా?

## మిర్చి సీజన్‌లో తప్పని ఇబ్బందులు

గుంటూరు: మిర్చియార్డులో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. సగానికి పైగానే పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిర్చియార్డుకు మంజూరైన రెగ్యులర్ ఉద్యోగులు 78 మంది కాగా.. ప్రస్తుతం 32 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వివిధ విభాగాల్లో మొత్తం 46 పోస్టులు ఖాళీగా ఉన్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో 102 మంది ఉద్యోగులు ఉండేవారని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు. పదేళ్ల కిందటితో పోలిస్తే బడ్జెట్లో మంజూరైన ఉద్యోగులు సంఖ్య 24 మందికి తగ్గింది. అయినప్పటికీ అన్ని పోస్టులు భర్తీ చేయలేని పరిస్థితి. ప్రత్తిపాడులో మార్కెట్ కమిటీ ఏర్పాటు చేశాక ఇక్కడ ఉద్యోగుల్లో కొందర్ని అక్కడకు పంపారు. మిర్చియార్డులో ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయలేదు. మార్కెటింగ్ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందంటున్నారు. మొత్తం 2,200 మంది సేవలందించాల్సి ఉండగా.. సగం కూడా ఉండరని, మొత్తం 1000 మంది లోపే ఉద్యోగులు ఉంటారని పేర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా మార్కెటింగ్ శాఖలో ఉద్యోగ నియామకాలు జరపకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని సిబ్బంది వాపోతున్నారు. గుంటూరు మిర్చియార్డుకు ఒక్క గుంటూరు జిల్లా నుంచే కాకుండా పొరుగున ఉన్న పల్నాడు, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతో పాటు రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా రైతులు మిర్చిని క్రయవిక్రయాలుకు తరలిస్తుంటారు. ఏడాదిలో మిర్చి సీజన్ అయిదారు నెలలు ఉంటుంది. డిసెంబర్ నుంచే కర్నూలు ప్రాంత రైతులు సరకును తీసుకువస్తుంటారు. జనవరి నుంచి మేలో వేసవి సెలవుల ఇచ్చే వరకు సగటున లక్షకు పైగానే మిర్చి బస్తాలు యార్డుకు వస్తుంటాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో లక్షన్నరకు పైగా బస్తాలను విక్రయాల నిమిత్తం రైతులు తీసుకువస్తారు.



అన్ని విభాగాల్లో సరిపడా సిబ్బంది ఉంటే క్రయవిక్రయాలు త్వరితగతిన జరగడంతో పాటు మిర్చియార్డులో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావు. అవకతవకలు, అక్రమాలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవడం పాటు రైతులకు విస్తృతంగా సేవలందించేందుకు వీలుంటుంది. క్షేత్ర స్థాయిలో ఉండాల్సిన కింది తరగతి పోస్టులన్నీ చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. సూపర్‌వైజర్ దిగువ యూడీసీ, ఎల్డీసీ, బిడ్ క్లర్క్, సహాయ సూపర్‌వైజర్లు, గ్రేడర్లు, టైపిస్టులు, జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్లు, వాచ్‌మన్స్, అటెండర్స్ పోస్టులు భర్తీ కాలేదు. ఈ విభాగాల్లో ఒకరో, ఇద్దరో ఉన్నారు. కొన్ని పోస్టుల్లో అయితే వారు కూడా లేరు. పోస్టులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో గత్యంతరం లేక పొరుగు సేవల ఉద్యోగులపై ఆధారపడుతున్నారు. పొరుగు సేవల విభాగంలో 13 మంది, సెక్యూరిటీ విభాగంలో 40 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులంత బాధ్యత వీరికి అంతగా ఉండదని... ఈ పొరుగు సేవల ఉద్యోగులనే రెగ్యులరైజ్ చేస్తారా అంటే అదీ లేదని సిబ్బంది వాపోతున్నారు. పొరుగు సేవల సిబ్బందికి సకాలంలో జీతాలు అందకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు చేతివాటం కారణంగా అవకతవకలు అరికట్టడం అధికారులకు సాధ్యం కావడంలేదు.

# కొరత తీరక..కలత వీడక



కాకినాడ :వరి చేను పిలకల దశ దాటింది. మరికొన్నిచోట్ల చిరుపొట్ట దశలో ఉంది. దశల వారీగా ఎరువు వేయడంలో అప్రమత్తంగా లేకపోతే దిగుబడి తగ్గి.. చీడపీడలు ఆవహిస్తాయి. ఎరువుల అవసరం దండిగా ఉన్నా ఉమ్మడి జిల్లాలో అందుబాటులో లేక అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. ప్రధానంగా కాంప్లెక్స్ ఎరువులు దొరక్క... ఏదో రకం ఎరువుతో సరిపెడుతున్నారు. కోనసీమలో గత ఖరీఫ్‌లో కొన్ని మండలాల్లో పంట విరామం పాటించారు. వీరంతా రబీకి ముందస్తుగా వచ్చి.. డిసెంబరులోనే నాట్లు పూర్తి చేశారు. ఇప్పుడు పంట చిరుపొట్ట దశకు చేరడంతో కాంప్లెక్స్ ఎరువులు వాడాలి. అధికారులేమో అదిగో.. ఇదిగో అని దాటవేస్తున్నారు. చేసేదేమీ లేక అందుబాటులో ఉన్నవే వేస్తున్నారు. కాకినాడ జిల్లాలో లభ్యత ఫర్లేదు అనుకున్నా.. అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో తొలి దశలో నాట్లు వేయగా ఇక్కడి రైతులూ ఎరువుల కోసం తిరుగుతున్న దయనీయమిది. రబీలో యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అవసరం. చేనుకు పచ్చదనం, త్వరగా ఎదగాలని యూరియా అధికంగా వాడటంతో గిరాకీ పెరిగింది. యూరియా 45 కిలోల బస్తా రూ.266.67కు విక్రయించాలి. ప్రైవేటు డీలర్లు ఒక్కో బస్తాకు రూ.300 తీసుకుని.. రసీదులూ ఇవ్వడంలేదు. ఉమ్మడి జిల్లాలో 1,015 మంది ప్రైవేటు డీలర్లు ఉండగా వీరి వద్దనే ప్రస్తుతం నిల్వలు ఉన్నాయి. వీరు అధిక ధరలకు అమ్ముతున్నా పర్యవేక్షణ కొరవడింది. వ్యవసాయ, ఉద్యాన సహాయకుల పర్యవేక్షణలో నిర్దేశిత ధరలకే ఎరువులు అమ్మాల్సి ఉన్నా.. ఆ ఊసే లేదు. ఇక డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచేస్తున్నారు. కొన్నిచోట్ల ప్రస్తుత వరి చేను దశకు కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా వాడాలి. వీటి ధరలపై నిఘా పెట్టాలి. ప్రైవేటు దుకాణాల్లో ధరల పట్టికలు లేవు. తూర్పుగోదావరి జిల్లాలో రబీలో 1,28,157 ఎకరాల్లో వరి వేశారు. అన్ని రకాలు కలిపి 47 వేల టన్నుల ఎరువులు అవసరం. ఇప్పటికి 34 వేల టన్నులు సరఫరా చేశారు. ఆర్బీకేల్లో కేవలం ఆరు వేల టన్నులే పంపిణీ చేశారు. అనపర్తి, బిక్కవోలు, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురంలో బొండాలు రకం ఎక్కువగా సాగు చేశారు. కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లోనూ ఇంతే. ఇక్కడ రబీ సాగు ముందుగా జరిగింది. ఇక్కడ ఎరువుల వాడకం ఎక్కువ. తూర్పున మొక్కజొన్న, చెరకు, అరటి పంటలు సాగులో ఉండగా వీటికి ఎరువులను వినియోగిస్తారు. ఈ నేపథ్యంలో అవసరాల మేరకు ఎరువులు ఉంచాలి. కొన్ని ఎరువులను అధిక ధరలకు అమ్ముతున్నా నిఘా కొరవడింది. పంట చిరుపొట్ట దశకు చేరిన నేపథ్యంలో ఎరువుల వినియోగం అధికంగా ఉంది. అన్ని గ్రామాల్లో వీటిని సరఫరా చేయాలి.

# అనుమతులు గోరంత.. తవ్వకాలు చెరువంత

నిడదవోలు:నిడదవోలు మండలం కంసాలిపాలెంలో సుమారు 42 ఎకరాల్లో చౌళం చెరువు ఉంది. దీని ద్వారా చుట్టుపక్కల రైతులకు సుమారు 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేది. కొంతమంది అక్రమార్కుల కన్ను దీనిమీద పడటంతో చాలావరకు ఆక్రమణలకు గురై కేవలం 8 నుంచి 10 ఎకరాల వరకు మాత్రమే చెరువు రూపంలో మిగిలి ఉంది. కొన్నేళ్ల క్రితం నీరు–చెట్టు పథకంలో భాగంగా ఆక్రమణలను తొలగించి చెరువును పునరుద్ధరించారు. అంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత పాలకులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు మళ్లీ రెచ్చిపోయారు. దీనికి తోడు పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు బాగా ఉండటంతో బోరు నీరు సమృద్ధిగా వస్తోంది. ఈ క్రమంలో జగనన్న కాలనీల్లో లేఔట్ల చదనుకు అనుమతుల పేరుతో ఈ చెరువు మట్టిని తరలిస్తున్నారు. ఇక్కడి నుంచే అసలు సమస్య మొదలైంది. ప్రస్తుతం నిడదవోలు పట్టణంలోని జగనన్న కాలనీలో పూడిక చేసే పనులు జరుగుతున్నాయి. దీనికి కంసాలిపాలెం చౌళం చెరువు నుంచే మట్టిని తరలిస్తున్నారు. దీనికి అనుమతులు ఉన్నా పూర్తిస్థాయిలో పర్యవేక్షణ మాత్రం లేదు. ఎంతవరకు అనుమతులు ఇచ్చారు, ఎంతమేర తవ్వుతున్నారో పట్టించుకునే వారే లేరు. అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు.అంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత పాలకులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులు మళ్లీ రెచ్చిపోయారు. దీనికి తోడు పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు బాగా ఉండటంతో బోరు నీరు సమృద్ధిగా వస్తోంది. ఈ క్రమంలో జగనన్న కాలనీల్లో లేఔట్ల చదనుకు అనుమతుల పేరుతో ఈ చెరువు మట్టిని తరలిస్తున్నారు. ఇక్కడి నుంచే అసలు సమస్య మొదలైంది. ప్రస్తుతం నిడదవోలు లాగ్‌బుక్ నిర్వహణ అనేది అక్కడ కనిపించట్లేదు.



ఇటీవల పరిశీలించగా ఓ ప్రైవేటు వ్యక్తి ఎన్ని లారీలు వెళ్తున్నాయో నమోదు చేస్తున్నారు. అతను కూడా లేఔట్‌లో మట్టి నింపే గుత్తేదారుడికి చెందిన వ్యక్తే కావడం గమనార్హం. లారీకి అయిదు యూనిట్ల చొప్పున రోజుకు 70 నుంచి 80 లారీల్లో 375 యూనిట్ల మట్టి తరలిస్తున్నారు. ఇది కాకుండా లెక్కాపత్రం లేకుండా తరలిస్తున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లోడింగ్, అన్–లోడింగ్ ప్రాంతాల్లో పురపాలక అధికారులు ఉండాలి. కానీ ఎవరూ ఉండట్లేదు.

అనుమతి ఉందంటూ ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. మట్టి తరలింపులో నిబంధనలు పాటించట్లేదు. జగనన్న లేఔట్ పూడిక నిమిత్తం అనుమతులు ఉన్నాయి. లోడింగ్ జరిగే ప్రాంతం, దిగుమతి జరిగే ప్రాంతాల్లో సిబ్బందిని నియమించడంతో పాటు, లాగ్‌బుక్ నిర్వహించాలని పురపాలక అధికారులకు సూచించాం. అలా లేనిపక్షంలో తక్షణమే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

# పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు



బాపట్ల,: శాసనమండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 13 మండలాల పరిధిలో పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు మార్చి 13న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి అధికారులు పని చేయాలని, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 13 మండలాల పరిధిలో 17,626 మంది పట్టభద్ర పురుష ఓటర్లు, 8,745 మంది మహిళా ఓటర్లు, ఇతరుల కేటగిరీలో ఒకరు కలిపి మొత్తం 26,372 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పట్టభద్రులకు 24 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఓటర్లకు 13 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఓటర్ల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కమాండ్ కంట్రోల్ రూమ్, పోలింగ్ సరళి పరిశీలించటానికి వీడియోగ్రఫీ, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, పత్రాలు, పోలింగ్ కేంద్రం నిర్వహణపై అధికారులకు, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జేసీ శ్రీనివాసులు, ఏఎస్పీ మహేష్, డీఆర్వో లక్ష్మీశివజ్యోతి, ఆర్డీవోలు రవీందర్, సరోజని పాల్గొన్నారు.

# ఫలించిన సుదీర్ఘ నిరీక్షణ-

# 1998 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టులు

పామర్రు :పాతికేళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కబోతోందని 1998 డీఎస్సీ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారిని సెకండరీ గ్రేడు టీచరు పోస్టుల్లో ఒప్పంద ప్రాతిపదికన నియమించడానికి ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1998లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులకు కటాఫ్ మార్కులు నిర్ణయించి రిజర్వేషన్లు కేటాయించింది. అందులో ఓసీలకు 50, బీసీలకు 45, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 40 మార్కులుగా నిర్ణయించారు. ఆ మేరకు అర్హత సాధించిన వారిని ముఖాముఖికి పిలిచారు. దీనికి సంబంధించి అప్పట్లో 221 జీవో జారీ చేశారు. కొన్ని విభాగాల్లో కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులు లేకపోవడంతో మరో జీవో 618ను విడుదల చేసి కటాఫ్ మార్కులను 45–40–35గా నిర్ధారించారు. అదే సమయంలో ఏపీలో ఉప ఎన్నికలు రావడంతో ప్రక్రియ చాలా జిల్లాల్లో జరగలేదు. ఎన్నికలు పూర్తయిన తరువాత జిల్లాలో 1:3 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలిచారు. రెండు జీవోల ప్రకారం కూడా అభ్యర్థులు హాజరయ్యారు. మొదటి జీవో ప్రకారం ఎక్కువ కటాఫ్ మార్కులొచ్చిన చాలా మంది ఉద్యోగానికి అర్హత సాధించలేక పోయారు. అంతకు ముందు జరిగిన డీఎస్సీల్లో మిగిలిపోయిన వారికి రోస్టర్, సీనియార్టీ ప్రకారం ఖాళీ అయిన పోస్టులు కేటాయించేవారు.



# సూక్ష్మ రుణ ప్రణాళికతో బలోపేతం



కొవ్వూరు:సూక్ష్మ రుణ ప్రణాళికతో మహిళా సంఘాలు ఆర్థి కంగా బలోపేతం అవ్వాలని మెప్మా పీడీ బి.ప్రియంవద అన్నారు. కొవ్వూరు పురపాలక కార్యాలయంలో సీఎంఎం ఎ.జ్యోతి అధ్యక్షతన రిసోర్స్ పర్సన్లతో సమావేశం నిర్వహించారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు, లాభాలు, పొదుపు, సమావేశాల తీరు, తీర్మానాలు, కొత్త గ్రూపుల ఏర్పాటుపై సమీక్షించారు. ప్రియంవద మాట్లాడుతూ జిల్లాలో 2022–23లో 153 సంఘాలు రూ.19.37 కోట్లు రుణాలు పొందాయన్నారు. ఆర్పీలు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని, ప్రతి విషయాన్ని సంఘ సభ్యులకు చెప్పాలన్నారు. నగదు తీసుకోకుండా, చెక్కు రూపంలో లావాదేవీలు జరపాలన్నారు.

Printed And Published By V.Narsingam, On Behalf Of Ch.V. Prabhakar Rao And Printed At Sri Sharadha Offset Printers. H.No.9-14/8/3, Buggaram Village And Mandal, Buggaram Gramapanchayath- 505454, Jagtial District, Telangana State.. Published At 6-6-206,Padma Nagar, Jagtial - 505327, Jagtial District, Telangana State.
Editor : Ch V. Prabhakar Rao, Rni T.C. Teltel 2021/81092 Phone : 9391533339 Email: Prajamantalu@Gmail.Com